

వాసవి మాతకు ప్రత్యేక పూజలు

• వాసవీ మాతకు నీరాజనం



రథయాత్ర

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి జయంతిని శనివారం భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పెనుగొండ మూల విరాట్ నగరేశ్వర మహిషాసుర మర్దని, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, వాసవి శాంతి ధామ్ భక్తులతో కిటకిటలాడింది. 7లో

• శ్రీవారి కల్యాణ.. బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కాళ్లకూరు శ్రీ వేంకటేశ్వరస్వామి

ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా ఉభయ దేవేరులతో స్వామి ముస్తాబయ్యారు. మరోవైపు కాళ్ల మండలం కాళ్లకూరు శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సంతానం కోసం దంపతులు స్వామి వారి గరుడ పొంగలి విశేష ప్రసాదాన్ని స్వీకరించారు. 7లో



ద్వారకా తిరుమలలో పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా శ్రీవారు, అమ్మవార్లు



కొత్తూరు - గుర్వాయి పాలెం రహదారి దుస్థితి

ఈ సీజన్‌కు.. ఇంతే!

ఎన్నికల పండుగలో అటు జనం ఇటు ప్రభుత్వ యంత్రాంగం మునిగితేలింది. ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు గడిచిన రెండుమాసాలుగా కంటిమీద కునుకు లేకుండా నిమగ్నమయ్యారు. మరే ఏపథకం ఊసు ఎత్తకుండా కేవలం ఎన్నికల నిర్వహణ మీదే దృష్టి పెట్టారు. ఇక ఓటర్లు రాజకీయ ప్రచారాలు, పార్టీలకు అనుకూలత, వ్యతిరేకత వైపు మొగ్గు చూపారే తప్ప తమకు అమలు కావాల్సిన పథకాల గురించి సీజన్ మారి కొత్త సీజన్ వస్తున్న నేపథ్యంలో ప్రతిసారి జరిగే పనులు స్తంభించినా యంత్రాంగాన్ని ప్రశ్నించిన పాపాన పోలేదు.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఎన్నికల దెబ్బతో అంతా మటాష్

- ఎక్కడికక్కడే వార్షిక ప్రణాళిక అమలుకు ఆటంకాలు
- అడిగేవారు లేరు.. సమాధానం ఇచ్చేవారు అంతకంటే లేరు
- కాల్వల ఆధునికీకరణ గాలికి వదిలేశారు
- పథకాల అమలు ఆగిపోయింది..
- పోలింగ్ తర్వాత గాడిన పడని యంత్రాంగం

అంతా ఎన్నికలమయం

వేసవి సీజన్ వచ్చిందంటే పట్టణం, పల్లె తేడా లేకుండా తాగునీటి సరఫరా, కొరత ఎదుర్కొనే గ్రామాలు, పట్టణాల వైపే దృష్టి సారించేవారు. ఆ దిశగానే ప్రత్యామ్నాయ చర్యలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించు కునేవారు. ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా క్షణాల్లో తీరిపోయేలా జాగ్రత్త పడేవారు. ఒకవైపు ప్రజాప్రతినిధులు, అధికారులు వెంట పడి మరీ పనులు చేయించేవారు. సాధారణ జనం సైతం రోడ్డుకు ఎక్కి నిలదీసి సమస్య పరిష్కారానికి ఏదో రూపంలో తమవంతు కృషి చేసేవారు. కాని ఈసారి వచ్చిన ఎన్నికల నేపథ్యంలో సమస్యలన్నీ గాల్లో కలిశాయి. ఏ ఒక్క ప్రధాన సమస్య తెరముందుకు రానేరాలేదు. ఒకవేళ వచ్చినా తామంతా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో క్షణం తీరకలేకుండా ఉన్నామంటూ అధికారులు దాటేశారు. కొందరు గట్టిగా ప్రశ్నించినా ఎన్నికల కోడ్ అమలులో ఉందంటూ తప్పించుకునే ఘటనలు లేకపోలేదు. తాగునీటి సమస్య ఎదురయ్యే ప్రాంతాలు అన్నింటిలోనూ ఈ సీజన్‌లో కనీసం పట్టించుకున్న దిక్కే లేదు. ఈ దిశగా యంత్రాంగం సైతం సమీక్షించనులేదు. పనిలో పనిగా వేసవిదాటి తొలకరి వస్తుంటే నెలరోజులు ముందుగానే పంట కాల్వల ఆధునికీకరణ, మరమ్మతులు చేయాల్సి ఉంది. ఏలూరు జిల్లా పరిధిలో కృష్ణా కెనాల్ మరమ్మతులు, నిర్వహణ ఏటా వేసవిలోనే చేపట్టేవారు. ఈ ఎన్నికల సీజన్‌లో ఏ ఒక్కరూ ఆవైపు దృష్టేపెట్టలేదు. ఓఅండ్ఎం పనులు మూలన పడ్డాయి. ఎంత మేర పనులు చేసింది? అధికారులు వెల్లడించను లేదు. ఒకవైపు మంచినీటి సరఫరా, ఇంకోవైపు సాగునీరు అందించే కాల్వల స్థితిగతులపై అంతా సైలెంట్. మరో 20 రోజుల వ్యవధి లోనే తొలకరి రానుంది. ఎన్నికలు పూర్తయ్యాయి కాబట్టి మిగతా సమయాన్ని పక్కా కార్యాచరణతో పూర్తి చేయాల్సి ఉన్నా ఇరిగేషన్ అధికారులతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, మిగతా అనుబంధ శాఖలు ఈవైపు దృష్టిపెట్టిన పాపాన పోలేదు.

కాలనీలను కప్పేశారు

జగనన్న కాలనీల్లో మెరక పోయడం, వీధిలైట్లు అమర్చడం వంటి పనులతో నోటిఫికేషన్‌కు ముందు హడావుడి చేసిన యంత్రాంగం ఇప్పుడు ఆ విషయాన్ని మరిచిపోయినట్లే కనిపిస్తోంది. వేసవిలో పూర్తి కావాల్సిన పనులు పూర్తయితే తప్ప వర్షాకాలంలో ఈ పనులు ముందుకు సాగనే సాగవు. ఎన్నికల కోడ్ ఇంకా పూర్తిగా తొలగించలేదు కాబట్టి ఈ పథకాల అమల్లో అధికారులు కన్నెత్తి చూడకపోవచ్చు. కాని పాత పథకాలే కొనసాగిస్తున్నందున దీనికి అనుగుణంగానే వ్యవహరించాల్సిన యంత్రాంగం కూడా మీనమేషాలు లెక్కిస్తోంది. ఇదిలా ఉండగా ఎన్నికలకు ముందు వివిధ ప్రభుత్వ పథకాలకు సీఎం జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి సొమ్ము జమ అంటూ హడావుడి చేశారు. బటన్ నొక్కి మూడునెలలు అవుతున్నా ఇప్పటికి ఏ ఒక్కరి ఖాతాలోనూ నిధులు జమ కాలేదు. లబ్ధిదారులు సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతుంటే అందరికీ అందితే.. మీకు అందుతుందంటూ వెనక్కి తిప్పి పంపిస్తున్నారు. ఎప్పుడో మూడు నెలల ముందే బటన్ నొక్కినా ఎందుకు ఇలా జరిగిందంటూ కొందరు నేరుగా అధికారులను నిలదీస్తున్నారు.

అందరి దృష్టి ఒకవైపే..

సార్వత్రిక ఎన్నికలు వచ్చిన దగ్గర నుంచి అటు యంత్రాంగం, ఇటు జనం చూపంతా ఆవైపే పడింది. కొన్ని పనులు చేయడానికి నిధులు లేక, రాక అధికారులు చేతులెత్తేస్తే ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి కావా లనే కొందరు ఈ పనులు అన్నింటికి అడ్డు తగులుతు న్నారంటూ అధికార వైసీపీ, ప్రతిపక్షాలపై బురద చల్లుతూ వచ్చింది. ఓ అడుగు ముందుకు వేసి తిరిగి తాము అధికారంలోకి వస్తేనే ఈ పనులన్నీ పూర్తవుతాయని, లేకపోతే అంతే సంగతంటూ పోలింగ్ సమ యం వరకు ప్రజలను మభ్యపెడు తూనే వచ్చారు. పథకాల అమ లుకు నయాపైసా కూడా విడు దల చేయని విషయాన్ని అధి కార పార్టీ ఎక్కడా నోరు విప్పి తే ఒట్టు. ఎన్నికల వ్యవహారం నడుస్తోంది కాబట్టి అధికారు లంతా ఆ పనుల్లోనే నిమగ్నమై ఉండగా, ఇటు జనం సమస్యలు, పక్కన పడేశారు. వేసవిలోనే పూర్తి చేయాల్సిన రోడ్ల మరమ్మతులు, నిర్వహణ పనులు ఎన్నికల గాలిలో కలిసిపోయాయి. ఇప్పటికి అన్ని ప్రధాన మార్గాల్లోనూ రోడ్లు ఛిద్రమై కనిపిస్తున్నాయి. ఆఖరికి బడులు తెరిచేందుకు ఇంకా తక్కువ సమయం మిగిలి ఉండగా, ఆ ఏర్పాట్లలోనూ కోడ్ బూచ్‌ని చూపి చర్యలకు దిగితే ఒట్టు. ప్రత్యేకించి జూన్‌లో సీజనల్ వ్యాధులు ముంచెత్తు క్రమంలోనూ ఇప్పటివరకు ప్రభుత్వపరంగా కార్యాచరణ ప్రకటించలేదు. మునిసిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోనూ యంత్రాంగానిది ఇదే తీరు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టం : కలెక్టర్

ఏలూరు సిటీ, మే 18 : స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. ఈవీఎం, వీవీప్యాట్‌లు భద్రపరిచిన సర్ సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్ ప్రాంతాలను శనివారం కలెక్టర్ జిల్లా ఎస్పీ మేరీప్రశాంతితో కలసి ఆకస్మికంగా తనిఖీలు చేసి, భద్రతాపరమైన అంశాల్లో సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు , ఆదేశాలు జారీ చేశారు. లాగ్‌బుక్‌లో కలెక్టర్, ఎస్పీ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా విషయంలో కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లాకు చెందిన 7 అసెంబ్లీ , ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి పోలింగ్ అయిన బ్యాలెట్ యూనిట్స్ , కంట్రోలు యూనిట్స్ , వీవీప్యాట్స్ అత్యంత జాగ్రత్తగా భద్రపరిచినట్టు తెలిపారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు 144 సెక్షన్ అములలో ఉంటుందన్నారు. ఎస్పీ స్ట్రాంగ్‌రూమ్ వద్ద విధి నిర్వహణలో ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్ వద్ద అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్ పరిసర ప్రాంతాల్లో మూడు అంచెల భద్రత ఏర్పాటు చేసి , సీసీ కెమేరాలు ఏర్పాటు చేశామని, స్ట్రాంగ్‌రూమ్ చుట్టుపక్కల 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రజలెవరు కళాశాల చుట్టుపక్కల సంచరించరాదని హెచ్చరించారు. ఉంగుటూరు, ఏలూరు, కైకలూరు నియోజకవర్గాల ఆర్వోలు , ఇతర అధికారులు పాల్గొన్నారు.



నిఘా నేత్రం..



ఏలూరు టూటౌన్‌లో శుక్రవారం కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

- పోలింగ్ అనంతరం చాపకింద నీరులా అల్లర్లు
- జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తం
- అడుగడుగునా తనిఖీలు.. పోలీస్ పికెట్లు
- ఏలూరులో ఇప్పటికే కార్డన్ సెర్చ్
- జూన్ 15 వరకు జిల్లాలోనే నాగాలాండ్, కేంద్ర బలగాలు

ఏలూరు క్రైం, మే 18 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగినప్పటికీ అనంతరం జిల్లాలో పలుచోట్ల ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వివిధ కారణాలతో ఘర్షణలకు దిగారు. ఈనెల 13వ తేదీ పోలింగ్ రోజున చిన్న చిన్న తోపులాటలు, అల్లర్లు మినహా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఎస్పీ మేరీ ప్రశాంతి గతంలో ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన నేపథ్యంలో జిల్లా పరిస్థితులపై అవగాహన ఉండడంతో ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు తీసుకుని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూశారు. జిల్లాకు వచ్చిన సీఐఎస్ఎఫ్ (కేంద్ర బలగాలు), నాగాలాండ్‌కు చెందిన కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు బందోబస్తుకు వచ్చాయి. ఎక్కడెక్కడ సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నాయో ఆ ప్రాంతాల్లో నాగాలాండ్ బలగాలను వినియోగించారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ ఏలూరులోనే ఉండడంతో స్వయంగా ఆయనే పోలింగ్ రోజు ఏలూరులోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏమి జాగ్రత్తలు తీసుకోవాలో పోలీసు అధికారులకు జారీ చేశారు. ఎస్పీ మేరీ ప్రశాంతి కూడా జిల్లాలో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అయితే ఆ సాయంత్రం నుంచే కొన్ని ప్రాంతాల్లో చెదురుమదురు ఘటనలు జిల్లాలో చోటుచేసుకున్నాయి. ప్రతి ఘటనపైన సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు. పల్నాడు జిల్లాలో ఎన్నికల అనంతరం జరిగిన పరిణామాలపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ అయిన విషయం తెలిసింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన కేంద్ర సాయుధ బలగాలను జూన్ 15 వరకూ ఉంచాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల ముందు ఎలాంటి కవాత్‌లు నిర్వహించారో వాటిని చేపట్టి ప్రజలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించాలని ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా పోలీస్ శాఖ కూడా అప్రమత్తమైంది. ఎన్నికల అనంతరం దెందులూరు, ఏలూరు, చింతలపూడి, నూజివీడు నియోజకవర్గాల్లో చిన్న చిన్న ఘటనలు జరగడంతో ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. ఏలూరు నగరంలో జరిగిన ఘటనలకు స్పందిస్తూ రాత్రి వేళ ఎస్పీ నగరంలో పర్యటించారు. ఆకస్మికంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లాలో ఉన్న నాగాలాండ్, కేంద్ర బలగాలతో రాత్రి వేళ, పగటి వేళ పోలీస్ కవాత్‌లు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నిఘా విభాగాలను రంగంలోకి దించారు. ట్రబుల్ మంగర్స్‌ను గుర్తించే పనిలో ఉన్నారు. రౌడీషీటర్లపై నిఘా పెంచారు. అనుమానాస్పదంగా ఉన్నవారిపై, అల్లర్లు సృష్టిస్తారని గుర్తించిన వారిపై గత ఎన్నికల్లో కేసులో ఉన్న వారిని మరోసారి బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరిగిన తర్వాత కూడా మరో 11 రోజులు పాటు కేంద్ర బలగాల సేవలను వినియోగించుకోవాలని, శాంతి భద్రతలకు ఎక్కడా విఘాతం రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఉండడంతో మొత్తం మీద పోలీస్ యంత్రాంగం శాంతి భద్రతలపై కఠిన చర్యలకు రంగం సిద్ధం చేసింది.

జిల్లాలో నిఘా పెంచాం : ఎస్పీ మేరీ ప్రశాంతి



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ అనంతరం జిల్లాలో నిఘా పెంచాం. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో 52 రాజకీయ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం. పోలీస్ పికెట్లను ఏర్పాటు చేసి నాగాలాండ్ బలగాలు, కేంద్ర బలగాలతో కార్డన్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాం. అల్లర్లకు పాల్పడినా సంబంధిత రాజకీయ నాయకులను స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ చేస్తున్నాం. ఎవరైనా వినకపోతే చట్ట ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అసాంఘిక శక్తుల సమాచారాన్ని సేకరిస్తున్నాం. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా రౌడీషీట్‌లను తెరుస్తాం. ఇప్పటికే శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై బైండోవర్ కేసులు నమోదు చేశాం.

• జిల్లాలో కొనసాగుతున్న తనిఖీలు



రాత్రి వేళ వాహనాలు తనిఖీ చేస్తున్న కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ జూన్ 4వ తేదీ వరకు అమలులో ఉండడంతో జిల్లా పోలీస్ శాఖ యథావిధిగానే జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న అధికారులు రాత్రివేళ ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. మరోవైపు రోడ్డు ప్రమాదాల నివారణకోసం జాతీయ రహదారి, రాష్ట్రీయ రహదారిలో వెళ్ళే వాహన డ్రైవర్లకు ఫేష్‌వాష్ నిర్వహిస్తున్నారు. ప్రధాన నగరాల్లో పోలీసు గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులను విచారిస్తున్నారు. లాడ్జీలను తనిఖీలు చేస్తున్నారు. పోలీస్ పికెట్లను, ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈవీఎంలను భద్రపరిచిన ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు.



కురుములతోగులో పారిశుధ్య చర్యలు

అదుపులో డయేరియా

- కొసాయిగుంపులో ఒక కేసు నమోదు
- మరో మూడు రోజుల పాటు వైద్య శిబిరాలు

కుక్కునూరు, మే 18 : మండలంలోని కురుములతోగు, కొసాయి గుంపు గ్రామాల్లో ప్రబలిన డయేరియా అదుపులోకి వచ్చింది. డయేరియాతో బాధపడుతూ భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఉన్న ఆదివాసీలకు వైద్యం అందుతోంది. పూర్తి స్థాయిలో తగ్గే వరకు ఎవరు ఆస్పత్రి నుంచి ఇంటికి రాకుండా ఇద్దరు వైద్య సిబ్బంది అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు. కాగా శనివారం కొసాయి గుంపునకు చెందిన మడిమి సోమ (28) అనే గర్భిణికి వాంతులు కావడంతో ఫీడర్ అంబులెన్స్ ద్వారా అమరవరం ఆస్పత్రికి తరలించారు. బాధిత రెండు గ్రామాల్లో మరో మూడు రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. డయేరియా నేపథ్యంలో ముందు జాగ్రత్తగా 15 పంచాయతీల్లో అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఆదివాసీలకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కురుములతోగు, కొసాయి గుంపు గ్రామాల్లో బోర్లు వేసి మంచినీటి సౌకర్యం కల్పించారు.



నిత్యావసరాలు అందజేత

మామిడీలా..!



మామిడి కాయల రాశి

- ధర ఉన్నా దిగుబడి లేదు..
- నత్తనడకన మామిడి ఎగుమతులు
- పెరిగిన రవాణా ఖర్చులు
- పడిపోయిన సాగు విస్తీర్ణం
- ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలంటున్నరైతులు

చింతలపూడి, మే 18 : చింతలపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో మామిడి మార్కెట్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ ఏడాది ధర ఉన్నప్పటికి దిగుబడులు లేకపోవడంతో ఎగుమతులు నత్తనడకన సాగుతోంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో కాయల్లో నాణ్యత లేదని వ్యాపారులు చెబుతున్నారు. బంగినపల్లి టన్ను నాణ్యతను బట్టి రూ.30 వేల వరకు ధర పలుకుతోంది. గత 15 రోజులుగా ఈ మార్కెట్ నుంచి మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. అక్కడి వ్యాపారులు నాణ్యతను చూసి కొనుగోలు చేస్తుంటారు. గతేడాది యార్డులో ఏర్పాటుచేసిన మామిడి మార్కెట్ ప్రాంగణంలో ఆరు కమిషన్ దుకాణాలు ఉండేవి. ఈ ఏడాది మూడు దుకాణాలకు పరిమితమయ్యాయి. రవాణా ఖర్చులు భారీగా పెరిగాయని కమిషన్‌దారులు వాపోతున్నారు.

పడిపోయిన సాగు విస్తీర్ణం

ఒకప్పుడు బంగినపల్లి రకానికి ఈ ప్రాంతం ప్రసిద్ధి. గొట్టపు బావుల సేద్యం రావడం, బోరు పడిన చోట పంట మార్పిడితో పామాయిల్ విస్తీర్ణం భారీగా పెరిగింది. గతంలో ఈ ప్రాంతంలో సుమారు 50 వేల ఎకరాల్లో ఉండే మామిడి తోటలు ఇప్పుడు కేవలం మూడు వేల ఎకరాలకు పడిపోయింది. ఇవి కూడా చింతల పూడి మండలంలోని బాలవారిగూడెం, యర్రంపల్లి, కన్నుపెడ, ప్రగడవరం, రాఘవాపురం, రేచర్ల, తీగలవంచ, శెట్టివారిగూడెం గ్రామాల్లో మాత్రమే ఉన్నాయి. ఈ ఏడాది తేనె మంచుకు ఐదు, ఆరు సార్లు పురుగుల మందు స్ప్రే చేసినప్పటికి మంగుతెగులు వ్యాపించిందని రైతులు చెబుతున్నారు. భవిష్యత్‌లో మామిడి తోటలు కనుమరుగు కాకుండా ప్రభుత్వం ప్రోత్సాహకాలతో పాటు సబ్సిడీపై ఆధునిక పనిముట్లు, సాగులో సలహాలు అందించాలని మామిడి రైతులు కోరుతున్నారు. మరోవైపు పచ్చళ్ళు పట్టాలంటే ఈ ప్రాంతంలో చెట్లకు నీరు పెట్టని పచ్చడి రకం కాయలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.

మంగు తెగులు ముంచింది..

ఈ ఏడాది మామిడి పంటపై ఐదారుసార్లు పురుగుల మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. ఫిబ్రవరిలో కురిసిన తేనెమంచు వల్ల పిందె దశలోనే తెగుళ్లు వ్యాపించి నాణ్యత తగ్గింది. మంగు తెగులు వల్ల దిగుబడి లేదు. మార్కెట్లో ధర ఉన్నప్పటికి రైతులకు ఉపయోగం లేకుండా పోయింది.



- ఆది సత్యనారాయణ, రైతు, లక్ష్మీనరసింహాపురం

ధర ఉన్నా దిగుబడి లేదు



బంగినపల్లికి ధర ఉన్నా దిగుబడి లేదు. మంగు తెగులుతో నాణ్యత దెబ్బతింది. నాణ్యత ఉంటేనే ధర వస్తుంది. ఇక్కడి నుంచి నాలుగు రాష్ట్రాలకు ప్రస్తుతం ఎగుమతి చేస్తున్నాం.

- చిక్కాల సుధాకర్, కమిషన్ వ్యాపారి

రవాణా ఖర్చులు పెరిగాయి..



రవాణా ఖర్చులు పెరిగాయి. రవాణా ఖర్చులు భారం తగ్గితేనే రైతుకు మేలు. కాయ కోత కోసేందుకు రైతుల కు ఆధునిక పరికరాలు ప్రభుత్వం సబ్సిడీపై అందించాలి.

- ఎస్.కె బడేమియా కమిషన్ వ్యాపారి

రబీ ధాన్యం బకాయిలు రూ.187.70 కోట్లు

ఏలూరు సిటీ, మే 18 : రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అయితే కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి చెల్లింపులు చేయాల్సి ఉంది. మూడు రోజులుగా మబ్బుల వాతావరణం, పలు చోట్ల వర్షాలు కురుస్తుండగా, మ కొన్ని రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రైతులు ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కోరుతున్నారు. మరో పక్క ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న సమయంలో పెట్టుబడులకు సొమ్ముల అవసరమవుతాయని, ధాన్యం సొమ్ములను చెల్లించడంలో 21 రోజులు నిబంధన కాకుండా కొంత సడలించి ముందుగానే సొమ్ములు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో ధాన్యం 3.20 లక్షల టన్నులు వరకు ఉత్పత్తి అవుతుండగా కేవలం 2.40 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే మిగిలిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు అమ్మాల్సి వస్తోందని, కౌలు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ రైతు సంఘం నాయకులు పేర్కొంటున్నారు. జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు 128 రైతు భరోసా కేంద్రాలను ఎంపిక చేశారు. ఈ ఆర్‌బీకేలకు అనుసంధానం చేసిన సొసైటీలు 69 ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 77,614 ఎకరాల్లో వరి సాగు చేయగా 3,20,596 మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడులు వస్తుందని అంచనా వేశారు. అయితే ఈసారి 2.40 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని ఇప్పటి వరకు లక్షా 98 వేల 926 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. జిల్లాలోని 16వేల 946 మంది రైతులకు చెందిన రూ. 429.63 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు రూ. 225. 70 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. రూ.16.23 కోట్లు చెల్లింపు కోసం ప్రాసెస్‌లో ఉండగా మిగిలిన రూ. 187.70 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది.

ప్రతి గింజా కొనుగోలు చేయాలి

రబీ సీజన్‌లో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేయాలి. జిల్లాలో 3.12 లక్షల టన్నుల వరకు దిగుబడులు వస్తాయని అంచనా వేసి కేవలం 2.40 లక్షలు టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తే రైతులు ఇబ్బందులు పడతారు. ధాన్యం సొమ్ములు చెల్లింపులో 21 రోజుల నిబంధన సడలించాలి. ధాన్యాన్ని త్వరిత గతిన కొనుగోలు చేయాలి.

- కె.శ్రీనివాస్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్


ఏలూరులో హాల్ టిక్కెట్లను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఏలూరు రూరల్, మే 18: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, సెరికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు ఏపీ ఈఏపీ సెట్‌లో భాగంగా శనివారం ఇంజినీరింగ్ విభాగంలో పరీక్షలు నిర్వహించారు. ఏలూరులోని సీఆర్ఆర్ ఇంజినీరింగ్, రామచంద్ర ఇంజినీరింగ్, సిద్దార్థ ఫెస్ట్ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తున్నారు. జేఎన్‌టీయూ కాకినాడ పర్యవేక్షణలో ఈనెల 23 వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ప్రతిరోజూ రెండు షిఫ్టుల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతున్నాయి. శనివారం 472 మంది విద్యార్థులకు గాను 460 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి.

'పశ్చిమ' జిల్లాలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో..

భీమవరం ఎడ్యుకేషన్ : పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆరు పరీక్ష కేంద్రాలలో ఇంజనీరింగ్ విభాగంలో పరీక్ష నిర్వహించారు. భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 175కి 168 మంది, డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 150కి 145 మంది, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రంలో 100కి 97, నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 156కి 150 విద్యార్థులు, శశి ఇంజనీరింగ్ కాలేజీలో 204 మందికి 197 మంది హాజరయ్యారుర. వాసవీ ఇంజనీరింగ్ కాలేజీలో కూడా పరీక్షలు నిర్వహించారు.

విద్యాబోధనలో అలసత్వం వద్దు

» విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్


దండగర్రలో పదో తరగతి టాపర్లతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాశ్

తాడేపల్లిగూడెం రూరల్/ భీమడోలు/ ఉంగుటూరు, మే 18 : విద్యార్థులకు అందించే విద్యాసామగ్రిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని, విద్యాబోధనలో అలసత్వం వహిస్తే సహించేది లేదని విద్యాశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ ఆదేశించారు. తాడేపల్లిగూడెం పట్టణంలో విద్యాకానుక స్టాక్ పాయింట్, పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌లను పరిశీలించారు. తాడేపల్లిగూడెం మండలం దండగర్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పీ కిట్‌లను ఎలా ఉపయోగిస్తున్నారో ఉపాధ్యాయులచే ఆపరేట్ చేయించారు. అనంతరం గ్రామంలో పదో తరగతి టాపర్‌తో మాట్లాడారు. అనంతరం ఏలూరు జిల్లాలోని భీమడోలు మండలం భీమడోలు, గుండుగొలను హైస్కూళ్లు, ఉంగుటూరు మండలం నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆయన సందర్శించారు. భీమడోలు మండలంలో పాఠ్యపుస్తకాల స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నారాయణపురం కాలేజీలో నాడు నేడు పనుల ప్రగతిని పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. తాడేపల్లిగూడెంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్‌వీ రమణ, ఏపీసీ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



నరసింహం, చినరాముడులకు శ్రీవారి చిత్రపటాలు అందిస్తున్న అధికారి

శ్రీవారి సన్నిధిలో ప్రముఖుల పూజలు

ద్వారకాతిరుమల, మే 13 : చిన వెంకన్న ఆలయాన్ని ఏపీ ల్యాండ్ రెవెన్యూ కమిషనర్ అప్పీల్స్ డాక్టర్ పి.లక్ష్మీనరసింహం కుటుంబ సమేతంగా, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఎం.డి. చినరాముడు కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అధికారులు, ఘనస్వాగతం పలికారు. తొలుత స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు జరిపారు. అనంతరం వారికి అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనాన్ని పలికారు. అధికారులు వారికి శ్రీవారి చిత్రపటాలు, ప్రసాదాలను అందించారు.

అలరించిన జాతీయ స్థాయి నృత్య పోటీలు



తాడేపల్లిగూడెం రూరల్, మే 18: తాడేపల్లిగూడెంలోని బీవీఆర్ కళాకేంద్రం ఆధ్వర్యంలో బీవీఆర్ కన్వెన్షన్ హాలులో జాతీయస్థాయి నృత్య పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు వారం రోజులపాటు జరుగుతాయని, విజేతలకు బహుమతులు అందిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా భరతనాట్యం, కూచిపూడి, జానపదం, నృత్యపోటీలు అలరించాయి. సుమారు 200 మంది కళాకారులు నృత్యపోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలకు బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకటరామారావు ఆధ్వర్యంలో జరిగాయి. సభ్యులు పీటీ వెంకన్న, దాసరి కాశీవిశ్వనాథం, కొప్పిశెట్టి రమణయ్య తదితరులు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు


'ఓ మనిషి కావాలి' నాటికలో కళాకారుల ప్రదర్శన

యలమంచిలి, మే 18: కొంతేరు గ్రామంలో యూత్ క్లబ్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 42వ అఖిల భారతస్థాయి నాటిక పోటీల్లో రెండోరోజు శనివారం ప్రదర్శించిన 'ఓ మనిషి కావాలి', 'మలి సంధ్య', 'క్షేత్రం' నాటికలు ఆకట్టుకున్నాయి. ఒక మనిషి మరో మనిషికి సహాయకారిగా ఉండి, ఒంటరితనం వేధించి బాధించకుండా మధురానుభూతుల్ని ఒంటరులైన వృద్ధులకు అందించే మానవత్వం ఉన్న మనుషుల కథాంశంతో 'ఓ మనిషి కావాలి' నాటిక ప్రదర్శించారు. మలిసంధ్య నాటికలో ఒకరు తోడు లేకపోయినా మరొకరు ఎలా జీవించాలో తన భర్తకు, భార్య తెలిపిన విధానం వీక్షకులను ఆకట్టుకుంది. ఆడపిల్లలను బ్రతకనిద్దాం.. బతికించుకుందాం అనే కథాంశంతో 'క్షేత్రం' ప్రదర్శించారు. యూత్ క్లబ్ నాటక పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అంబటి మురళీకృష్ణ, గంటా ముత్యాలరావు, కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోజురోజుకూ రద్దవుతున్న పలు రైళ్లు

రైళ్లకు రెడ్ సిగ్నల్



» ట్రాఫిక్ బాక్సులు, సిగ్నల్ సిస్టమ్ పనులతో కొన్ని రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

» రైలు పట్టాల సామర్థ్యం 130 నుంచి 160 కిలో మీటర్లకు పెంపు

» మూడో రైల్వే ట్రాక్ పనులు ఎప్పుడో ?

» దూర ప్రయాణాలకు రోడ్డు మార్గమే దిక్కు

సమయపాలన ప్రయాణానికి కచ్చితంగా అధికశాతం మంది రైలు మార్గాన్నే ఇష్టపడుతుంటారు. సూచించిన సమయానికి రైలు వస్తుందని నానుడి ఉంది. రోడ్డు మార్గం కంటే రైలు మార్గమే సుఖవంతంగా ఉంటుందని ఖర్చు తక్కువని భావిస్తూ పేదవారి నుంచి ధనవంతుల వరకు ఆసక్తి చూపిస్తుంటారు. వారి స్తోమతను బట్టి జనరల్ భోగీ, స్లీపర్ కోచ్, థర్డ్‌క్లాస్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీలో ప్రయాణాన్ని కొనసాగించువచ్చు. మరికొన్ని రైళ్ళలో చైర్‌కారు, ఏసీ చైర్‌కార్, జనరల్ కోచ్‌లు ఉంటాయి. వీటిలో కూడా ప్రయాణాన్ని కొనసాగించవచ్చు. అయితే ఇటీవల ట్రాఫిక్ బాక్సులు, సిగ్నల్ సిస్టమ్ పనులతో దశలవారీగా రైళ్లను రద్దు చేయడంతో ఏలూరు జిల్లాలోని ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరో ఏడాది పాటు రైళ్ల రద్దు ఉండవచ్చని రైల్వే అధికారుల సూచనలతో మరిన్ని ఇబ్బందులు తప్పేలా లేవు. ఏడాది తరువాతైనా కచ్చితమైన రైలు ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా ఉంటే శుభ పరిణామంగా భావించాలి.

\- ఏలూరు క్రైం

సాధారణంగా దూర ప్రయాణాలైనా.. దగ్గర ప్రయాణాలు చేయాలన్న ఎక్కువ శాతం మంది రైలు ప్రయాణానికి మక్కువ చూపిస్తారు. ఏలూరు జిల్లా ప్రజలకు ఎక్స్‌ప్రెస్ రైలు ఆగే రైల్వేస్టేషన్ ఒక్క ఏలూరులోనే ఉంది. జిల్లాలో పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల దర్శించాలంటే ఎంతటి దూరం నుంచి వచ్చిన వారైనా ఏలూరు రైల్వేస్టేషన్‌లో దిగి తమ ప్రయాణాన్ని కొనసాగించుకోవాలి. కొన్ని భీమడోలు స్టేషన్లలో ఆగుతున్నాయి. గతంలో గ్రామాల్లో ఉన్న రైల్వే స్టేషన్లను క్రమేపీ మూసివేశారు. ప్రస్తుతం ఏలూరు జిల్లా ప్రజలకు నగరంలో ఉన్న పెద్ద రైల్వేస్టేషనే ప్రయాణాలు కొనసాగించడానికి అనువుగా ఉంది. రోజుకు 130 నుంచి 140 రైళ్ల రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఈ రైళ్ళల్లో రోజుకు పది వేల నుంచి 15 వేల మంది వరకూ రాకపోకలు సాగిస్తూ ఉంటారు. రైల్వే స్టేషన్లు, రైల్వే లైన్లు ఆధునికీకరణ పనులు రెండేళ్ళ నుంచి రాష్ట్రంలో చేపట్టారు. దీనిలో భాగంగా గత ఏడాది నుంచి విజయవాడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఈ పనులు చేస్తున్నారు. ముఖ్యంగా మూడో ట్రాక్‌లైన్ కూడా దక్షిణ మధ్య రైల్వే విభాగం చేపట్టింది. ఇప్పటికే విజయవాడ- గూడూరు, వరంగల్ - ఖాజీపేట వంటి మార్గాల్లో మూడో లైను పనులు పూర్తి చేశారు.

మూడో ట్రాక్ లైన్ నిర్మాణానికి సర్వే..

ప్రస్తుతం విజయవాడ నుంచి విశాఖపట్టణానికి మూడో ట్రాక్ లైను నిర్మాణానికి సర్వే నిర్వహించారు. ఏలూరు నగరానికి సమీపంలోని వట్లూరు నుంచి అమ్మపాలెం, కొప్పాక, సోమవరప్పాడు మీదుగా దెందులూరు దాటిన తరువాత మూడో లైను గూడ్స్ రైళ్లు వెళ్లే మార్గంగా నిర్మించడానికి సర్వే చేశారు. ఏలూరు రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణికుల రైళ్ళు మాత్రమే వెళ్లేవిధంగా ప్రణాళిక చేశారు. మూడు వేల కోట్ల రూపాయల నిధులను కేటాయిస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. సర్వే తరువాత ఈ పనులు ఏమి జరిగాయో ఎవరికీ తెలియని పరిస్థితిలో ఆగిపోయాయి. ప్రస్తుతం మూడో లైనుకు సంబంధించి ట్రాఫిక్ బాక్సులను విజయవాడ నుంచి సమకూర్చుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం గన్నవరం-నూజివీడు మార్గమధ్యలో పనులను కొనసాగిస్తున్నారు. ఆ పనులు ఈనెలాఖరు వరకూ సాగనున్నాయి.

ట్రాక్ పనులు ఎప్పుడో ?

జిల్లాలో మూడో ట్రాక్ లైను నిర్మాణ పనులు ఎప్పుడు మొదలు పెడతారో తెలియని పరిస్థితి. ప్రస్తుతం ఉన్న రైల్వే ట్రాక్ పక్కనే విశాఖపట్టణం నుంచి విజయవాడ వరకు రోడ్డు మార్గం నిర్మాణానికి గతంలో సర్వే చేశారు. ఈ మార్గాన్ని రైల్వేకు సంబంధించిన వాహనాలు, అత్యవసర సమయాల్లో రైల్వే అంబులెన్సులు వినియోగించడం ఏదైనా మార్గమధ్యలో రైలు ప్రమాదం జరిగినా ప్రయాణికులను త్వరితగతిన చేరవేయడానికి ఈరోడ్డు మార్గం ఉపయోగపడుతుందని 2015 గోదావరి పుష్కరాలు సమయంలో రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ పనులు ఎక్కడా ప్రారంభించిన దాఖలాలు కానరాలేదు. ఏది ఏమైనా ప్రస్తుతం జిల్లా ప్రజలు రోడ్డు మార్గాన్నే ఆశ్రయించాల్సిన పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మరికొద్ది నెలల్లో సిగ్నల్, ట్రాఫిక్ బాక్సు పనులు

ఏలూరు జిల్లాలో మరి కొద్దినెలల్లో సిగ్నల్ సిస్టమ్, ఆటోమేటిక్ ట్రాకింగ్ సిస్టమ్ ట్రాఫిక్ బాక్సులు పనులను కొనసాగించనున్నారు. ఇప్పటి వరకు వంద కిలోమీటర్లు వేగం వెళ్లే కెపాసిటీ ఉన్న రైలు పట్టాలను 130 కిలోమీటర్ల వేగం ప్రయాణానికి పెంచారు. వీటిని మళ్ళీ ఇప్పుడు 160 కిలోమీటర్ల వేగంతో రైలు ప్రయాణించడానికి ట్రాక్‌లను మార్పులు చేర్పులు చేస్తున్నారు. ఇప్పటికే గన్నవరం నుంచి విజయవాడ వరకు ఈ పనులన్నీ పూర్తి చేశారు. ఈ నెలాఖరుకు ఏలూరు మీదుగా ట్రాక్ పనులు నిర్వహిస్తారని సమాచారం. విజయవాడ, విశాఖపట్టణం వెళ్ళే మార్గంలో ట్రాఫిక్ బాక్స్‌ల ఏర్పాటు అనంతరం విశాఖపట్టణం నుంచి విజయవాడ వెళ్లే మార్గానికి ట్రాఫిక్ బాక్సులను, సిగ్నల్ ఆధునికీకరణ పనులను చేపట్టనున్నారు. ఈ మార్గాల్లో గత ఏడాది నుంచి ప్రయాణించే అనేక రైళ్లను రద్దు చేసేశారు. ప్రస్తుతం ఏలూరు మీదుగా 84 రైళ్ళు అటు, 84 రైళ్ళు ఇటు రోజుకు వెళ్తున్నాయి. వీటిలో కూడా కొన్నింటిని కొద్ది రోజుల్లోనే రద్దు చేయనున్నారు. రాయగడ ఎక్స్‌ప్రెస్‌ను పూర్తిగా రద్దు చేశారు. సింహాద్రి రైలును కూడా పూర్తిగా శనివారం నుంచి రద్దు చేశారు. ఏలూరు మీదుగా వెళ్లే కోణార్క్, ఏపీ ఎక్స్‌ప్రెస్ రైళ్ళను పూర్తిగా దారి మళ్ళించి నిడదవోలు, భీమవరం జంక్షన్, కైకలూరు, గుడివాడ మీదుగా విజయవాడకు అటు ఇటు పంపిస్తున్నారు. ఇక ఈ రైళ్ళను జిల్లా ప్రజలు మర్చిపోవాల్సిందే అన్న రీతిలో ఉండిపోయింది. ప్రయాణికుల రద్దీ మేరకు వేసవి ప్రత్యేక రైళ్ళను పెంచుతున్నారు.

వరుడైన చిన వెంకన్న

» ద్వారకాతిరుమలలో వైశాఖ బ్రహ్మోత్సవాలు ప్రారంభం


మహావిష్ణువు అలంకరణలో శ్రీవారు

ద్వారకాతిరుమల, మే18: ద్వారకాతిరుమల శ్రీవారి వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి ఆలయ నిత్యకల్యాణ మండప ఆవరణలో విశేష అలంకరణలో అలివేలు మంగ, ఆండాళ్ అమ్మవార్లు కొలువుతీరగా.. నడుమ ఉన్న చిన్నతిరుమలేశుడు పెండ్లి కుమారునిగా ముస్తాబయ్యారు. ఉభయదేవేరులు పెండ్లి కుమార్తెలయ్యారు. ఉదయం ఏర్పాటు చేసిన సువర్ణ సింహాసనంపై స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులను ఉంచి ఆలయ అర్చకులు హారతులిచ్చి ఈ తంతును నిర్వహించారు. ఈవో త్రినాథరావు ఆద్యంతం పాల్గొని అర్చకులు, పండితులకు దీక్షా వస్త్రాలను అందచేసి అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

శ్రీభూసమేత మహావిష్ణువుగా శ్రీవారు

ఆదిశేషుని పడగన శ్రీభూసమేత మహావిష్ణువు అలంకరణలో శ్రీవారు ఆలయ ప్రాంగణములో భక్తజనులకు దర్శనమిచ్చారు. వైశాఖ మాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజుకో అలంకరణలో చినవెంకన్న సాక్షాత్కరిస్తారు.

గజ వాహనంపై శ్రీవారి రాజసం..


గజవాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

గజవాహనంపై ఉభయదేవేరులతో కొలువుతీరిన చిన వెంకన్నస్వామి క్షేత్రపురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల వాహనసేవల్లో భాగంగా తొలిరోజు శ్రీవారు, అమ్మవార్లు గజవాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో భక్తులను అభయహస్తాన్ని అందించారు. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లను గజవాహనంపై ఉంచి అలంకరించి మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ అట్టహాసంగా గ్రామంలో ఊరేగించారు.

భక్తులు ఫుల్.. సౌకర్యాలు నిల్

» ఎండ తీవ్రతతో వృద్ధులు, మహిళలకు ఇబ్బందులు


శ్రీవారి దర్శనార్థం ఎండలో బారులు తీరిన భక్తులు

చినవెంకన్న ఆలయం శనివారం భక్తజన సంద్రమైంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజవడం వల్ల ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేలాదిగా వచ్చిన భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో దేవస్థానం విఫలమైంది. శ్రీవారి దర్శనం క్యూకాంప్లెక్స్‌లోని ఐదు కంపార్ట్‌మెంట్‌లు నిండిపోయాయి. దాదాపు 30 వేల మంది వరకు యాత్రికులు రావడంతో క్యూకాంప్లెక్స్ ప్రాంతం నుంచి జంటగోపురాల ప్రాంతం వరకు బారులు తీరారు. శనివారం ఉదయం నుంచి భానుడు ఉగ్రరూపం దాల్చడంతో విలవిల్లాడారు. చంటిపిల్లలతో మహిళలు, వృద్ధులు గంటల తరబడి ఎండలో నిలబడాల్సి వచ్చింది. కనీసం మంచినీటి సౌకర్యం కల్పించలేదని భక్తులు ఆవేదన చెందారు. తాత్కాలిక టెంట్లు, చలువ పందిళ్లు వంటివి ఏర్పాటు చేయలేదని వాపోయారు. అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



వెంకన్న ఆలయంలో విద్యుత్ వెలుగులు, వేంకటేశ్వరస్వామి వారు

కాళ్లకూరు వెంకన్న తిరుకల్యాణోత్సవాలు ప్రారంభం

కాళ్ల(ఉండి), మే 18: కాళ్లకూరులో వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలో స్వయంభూ వేంకటేశ్వరస్వామి సప్తాహ్నిక వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలకు భక్తులు, మహిళలు స్వామి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలను నిర్వహించి ప్రసాదాలను స్వీకరించారు. ధ్వజారోహణ సందర్భంగా సంతానం లేని దంపతులు స్వామివారి గరుడ పొంగిలి విశేష ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయం ఎదురుగా రాష్ట్రీయ రహదారికి ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ ఆకట్టుకుంది. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ ఈవో ఎం.అరుణకుమార్, దేవస్థానం సిబ్బంది గ్రామస్థులు పర్యవేక్షించారు.

పెండ్లికుమారుడిగా అలంకరణ.. నేటి సాయంత్రం కల్యాణం

కల్యాణోత్సవాల్లో భాగంగా వైశాఖ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లకు వేద పండితులచే విశేష అర్చనలు, సాయంత్రం స్వామికి ఎదుర్కోలు సన్నాహం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించి రాత్రి 7-30 గంటలకు కల్యాణం నిర్వహిస్తామని ఈవో అరుణకుమార్ తెలిపారు.

జై వాసవీ మాత

» వైభవంగా వాసవీ మాత జయంతి వేడుకలు

పెనుగొండ, మే 18: జై వాసవి, జైజై వాసవాంబయ నమః నామస్మరణతో శనివారం పెనుగొండ మార్మోగింది. ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా పెనుగొండలోని మూల విరాట్ నగరేశ్వర మహిషాసుర మర్ధని, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, వాసవి శాంతి ధామ్‌లలో భక్తులు కిటకిటలాడారు. ఉదయం నుంచి పెనుగొండలోని రామాలయం నుంచి ఆలయం వరకు 102 కలశాలతో వాసవీ మాతను వెండి పల్లకిపై ఊరేగింపుగా తీసుకు వచ్చారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్ వాసవీ మాతకు వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కొద్దిమంది వాసవీ మాలధారులు గణపతి హోమం, వాసవి హోమాలు నిర్వహించి ఇరుముడులు సమర్పించారు. సాయంత్రం టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టుకు చెందిన బోడపాటి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వంద మంది హరే శ్రీనివాస భజన మండలి వారు కోలాటం, గరుడాద్రి శేషాద్రి, శేషాద్రి జోలు బృందం, దాసా సాహిత్య ప్రాజెక్టుకు చెందిన ప్రసాద్ గరగల బృందం ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పెనుగొండ వాసవి యువజన సంఘం ఆధ్వర్యంలో వెండి రథంపై అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈవో రామ పెద్దింట్లురావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెనుగొండ వాసవీ శాంతి ధామ్‌లో...

అఖిల భారత వాసవీ పెనుగొండ ట్రస్టు ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి కృష్ణానందపురి స్వామీజీ పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు కృష్ణమణికంఠ మరకత వాసవీ మాతకు అభిషేకాలు నిర్వహించారు. భజనలు, దీపోత్సవాలు కన్నుల పండుగగా నిర్వహించారు.


పొర్లు దండాలతో భక్తిని చాటుకుంటున్న భక్తుడు


పెనుగొండలో 102 కలశాలతో గ్రామోత్సవం

క్రైం కార్నర్

టైర్ పేలి ఆటోను ఢీకొన్న పెట్రోల్ ట్యాంకర్

» ఐదుగురికి తీవ్ర గాయాలు

» ట్యాంకర్ బోల్తాతో లీకైన పెట్రోల్, డీజిల్

» అప్రమత్తమైన అగ్నిమాపక, పోలీస్ శాఖలు

» తప్పిన ముప్పు.. ఊపిరి పీల్చుకున్న స్థానికులు



ఆటోని ఢీకొట్టిన ట్యాంకర్.. (ఇన్‌సెట్‌లో) 108 వాహనంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

నూజివీడు టౌన్, మే 18: పెట్రోల్ ట్యాంకర్ టైర్ పేలి ట్యాంకర్, ఆటోను ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన నూజివీడు మండలం మీర్జాపురం వద్ద చోటుచేసుకుంది. నూజివీడు నుంచి ఏలూరు వెళుతున్న పెట్రోల్ ట్యాంకర్ మీర్జాపురం వద్ద ముందు భాగంలోని ఎడమ టైర్ పేలి పోవడంతో ట్యాంకర్ అదుపుతప్పి హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు వస్తున్న ఆటోను ఢీ కొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న విశాఖ పట్నం గాంధీనగర్‌కు చెందిన కురందాస్ గోవింద్, కురందాస్ ఆదిలక్ష్మి, కురందాస్ రత్నం, అరసా ప్రసాద్‌తో పాటు తణుకు మండలం పైడిపర్రుకు చెందిన దూళ్ళ నాగపెద్దిరాజు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో 108 సిబ్బంది క్షతగాత్రులను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. కాగా పెట్రోల్ ట్యాంకర్, ఆటోను ఢీ కొన్న అనంతరం పల్టీ కొట్టడంతో ట్యాంకర్ నుంచి పెట్రోల్, డీజిల్ లీకవడంతో సంఘటనా స్థలంలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఎటువంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో నూజివీడు అగ్నిమాపక సిబ్బంది, పోలీస్ శాఖ ఘటనా స్థలానికి చేరుకుని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. దీంతో చుట్టుపక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు.

ఎస్ఐపై చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 18 : కోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో గతంలో పనిచేసి ఒక ఎస్ఐపై ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. సత్రంపాడునకు ఔటుపల్లి సీతయ్య 2021 నవంబరు 20వ తేదీన ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో ఓ హోటల్‌కు వెళ్లగా హోటల్ నిర్వాహకులతో వివాదం జరిగింది. దీంతో వారిపై సీతయ్య ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. తానిచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేయకుండా తన సంతకాన్ని ఫోర్జరీ చేసి ఐపీసీ శిక్షా కాలాన్ని తగ్గించే సెక్షన్లను వినియోగించారని ఈ నేరానికి అప్పటి టూటౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న ఎన్ఆర్ కిషోర్‌బాబు పాల్పడ్డారంటూ బాధితుడు ఏలూరులో కోర్టును ఆశ్రయించి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని మోసగించిన యువకుడు

» కుటుంబ సభ్యులపై కేసు నమోదు

పాలకోడేరు, మే 18 : ప్రేమిస్తున్నానని వెంటపడి మాయ మాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని మోసగించిన యువకుడితోపాటు, కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశామని పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో ని ఓ గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన పెర్తక ఆనందరాజు కుమారుడు కార్తీక్ రెండేళ్లుగా ఆమెను ప్రేమిస్తున్నానంటూ మోసగించాడు. ఈవిషయం పెద్దల సమక్షంలో పెట్టగా పెళ్ళి చేసుకుంటానని చెప్పి మోసగించడంతో యువతి ఫిర్యాదు మేరకు కార్తీక్‌తోపాటు తండ్రి ఆనందరాజు, సోదరుడు ఇజ్రాయిల్‌రాజుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.


చెట్లను నరికి కాల్చి మోదులుగా మారుస్తున్న దృశ్యం
సాగుకు అనుకూలంగా మార్చిన అటవీ భూమి

ఆక్రమణలో అటవీ భూములు

» ఇప్పటికే సాగు చేస్తున్న వారికి నోటీసులు జారీ

» క్షేత్రస్థాయి పరిశీలనలో సబ్ డీఎఫ్‌వో వెంకటసుబ్బయ్య

కుక్కునూరు, మే 18: కుక్కునూరు మండలం అమరవరం అటవీ రేంజ్ పరిధిలో వందలాది ఎకరాల అటవీభూమి ఆక్రమణకు గురవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. శ్రీధరబీట్ పరిధిలో సుమారు 1020 హెక్టార్ల ఎకరాల్లో అటవీ భూమి ఉండగా అందులో దాదాపు 800-1000 ఎకరాల మేర ఆక్రమణకు గురైనట్టు సమాచారం. చెట్లను నరికి ఆచెట్టు మోదులను కాల్చి వేస్తూ ఆ భూమిని చదును చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కొండపల్లి బీట్ పరిధిలో కూడా ఇటీవల కొందరు గిరిజనేతరులు అటవీభూములపై కన్నేసి ఆక్రమణలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. రాత్రికి రాత్రే ఎక్సవేటర్లు, డోజర్లు ఉపయోగించి భూమిని చదును చేస్తూ వ్యవసాయ భూమిగా మారుస్తున్నారు. ఈ క్రమంలో అటవీ భూములు అన్యాక్రాంతం అవుతున్నట్టు ఫిర్యాదులు రావడంతో శనివారం ఏలూరు సబ్ డీఎఫ్‌వో వెంకటసుబ్బయ్య క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. పదేళ్ల క్రితమే కొందరు ఈ భూములు ఆక్రమించి సాగు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో అటవీశాఖ సిబ్బంది సాగు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. ఆ భూముల సాగుకి సంబంధించి వారి దగ్గర ఆధారాలు ఉంటే సరి.. లేదంటే ఆ భూములను వెనక్కి తీసుకుని చర్యలు చేపడతామని అటవీ సిబ్బంది చెబుతున్నారు.

గాలికొదిలేసిన పార్కుల నిర్వహణ

- శిథిలమవుతున్న సామగ్రి
- పత్తాలేని నిర్వాహకులు
- కన్నెత్తైనా చూడని అధికారులు
- తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పార్కులంటేనే పచ్చదనానికి ప్రతీక. సాయం సంధ్య వేళలో అనేక మంది సేదతీరేందుకు, వాకింగ్ చేసేందుకు వెళుతుంటారు. ఉదయం నుంచి ఇంట్లో వంటా వార్పులతో అలసిపోయిన మహిళలు కాస్త ఉపశమనం కోసం పచ్చదనాన్ని ఆస్వాదించేందుకు ఆరుబయటకు వస్తుంటారు. అలా పార్కులోకి వెళితే అక్కడ పచ్చదనానికి బదులు అధ్వాన వాతావరణంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలా నగరంలోని పార్కుల అధ్వాన స్థితిపై ఈ కథనం.



పనికి రాకుండా పోతున్న చిన్నపిల్లల ఆట వస్తువులు



నిరుపయోగంగా ఉన్న జిమ్ము పరికరాలు

ఏలూరు టూ టౌన్ : ఎండలు మండిపోతున్నాయి. పగలంతా ఇళ్లల్లో ఉక్కబోత, చమటతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సాయంత్రం చల్లబడ్డాక సేద తీరడానికి పార్కులకు వెళ్తుంటే అక్కడ ఆహ్లాదకరంగా లేక అధ్వానంగా ఉండడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్కుల్లో పచ్చదనం కనిపించటం లేదు. పిల్లల ఆటవస్తువులు సరిగ్గా పని చేయడం లేదు. పార్కుల్లో గార్డినర్స్ బయోమెట్రిక్ హాజరు వేసి అలా వెళ్లిపోతారు. పర్మినెంట్ ఉద్యోగులు కనిపించనే కనిపించరు. వాళ్ల తరపున వేరే వ్యక్తులను కొంత నగదు ఇచ్చి పెట్టుకుంటున్నారు. వారు కూడా ఏదో పైపైన పనులు చేస్తూ అరగంటో గంటో ఉండి వెళ్లిపోతారు. అధికారులు పట్టించుకోరు. నగరంలో 25కి పైగా పార్కులున్నాయి. ఈ వీటిలో సౌకర్యాలు అంతంత మాత్రమే. ఆర్ఆర్ పేట మున్సిపల్ పార్కులో గార్డినర్ పర్మినెంట్ ఉద్యోగిగా ఉన్నారు. ఈమె పార్కులో కనిపించదు. ఈ గార్డినర్‌కు సుమారు రూ.50 వేల జీతం. ఆమె రూ.ఆరు వేలు జీతం ఇచ్చి ప్రైవేటు వ్యక్తిని నియమించుకొని ఆమె పనులు చేయిస్తుంది. అయితే ఆమె కూడా పార్కుల శుభ్రతను మొక్కుబడి చేసి చేతులు దులుపుకుంటుంది. ఉదయం అరగంట, సాయంత్రం అరగంట శుభ్రం చేసినట్టుగా శుభ్రం చేస్తుంది. తరువాత కనిపించదు. చిన్నపిల్లలు ఆడుకునే ఆట వస్తువులు ఎక్కడికక్కడ విరిగిపోవ డంతో చిన్నారులు నిరాశ చెందుతున్నారు.

అశోక్‌నగర్ పార్కులో అవుట్ సోర్సింగ్ సిబ్బంది గార్డినర్‌గా ఉన్నారు. ఆ గార్డినర్ రూ.21 వేల జీతం. అయితే ఆ గార్డినర్ కూడా విధులకి రారు. వేరే ఒక వృద్ధురాలిని రూ. ఆరు వేలు ఇచ్చి నియమించుకుంది. ఆమె కూడా పార్కులో ఎక్కడా కనిపించదు. లక్షలాది రూపాయలతో జిమ్ము పరికరాలు ఏర్పాటు చేశారు. ఆ పరికారాలన్ని నిర్వహణ లేక పాడైపోతున్నాయి. సిబ్బంది విధులకు రాకుండా ఇంజనీరింగ్ సెక్షన్‌లో ఉన్నతాధికారి ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. పర్యవేక్షణ లోపం కారణంగా జన్మభూమి పార్కు, ఇతర పార్కులు సాయంత్రం వేళల్లో సేదతీరే పరిస్థితులు లేవు. ఉన్నతాధికారులు స్పందించి పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలను ప్రజలు కోరుతున్నారు.

పట్టిసీమ ఫెర్రీ వేలం 22కి వాయిదా

పోలవరం, మే 18 : పట్టిసీమ ఫెర్రీ రేవు వేలాన్ని ఈ నెల 22కి వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి తెలిపారు. పట్టిసీమ ఫెర్రీ రేవులో పడవ నడుపుటకు, వాహన పార్కింగు కోసం సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో శనివారం పట్టిసీమ ఫెర్రీ రేవులో బహిరంగ వేలం నిర్వహించారు. అయితే ఎవరూ ధరావత్తు చెల్లించకపోవడంతో వేలాన్ని వాయిదా వేశారు. పార్కింగ్ వేలం నిర్వహించి హెచ్చు ధరకు పాడిన కాకి వీర్రాజుకి వేలం ఖాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీర్డీ శ్రీనివాసరావు పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. పోలవరం పంచాయతీ వారపు సంత, డైలీ మార్కెట్‌లో పన్నుల వసూలు చేయుటకు నిర్వహించిన వేలంలో ఎవరూ పాల్గొనకపోవడంతో ఈ నెల 20దీకి వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి అభిషేకం

పోలవరం, మే 18 : పట్టిసీమ కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్ వద్ద నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి శనివారం పంచామృత పంచసూక్త అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం మండపారాధన, అంకురారోపణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

శ్రీనగరేశ్వరస్వామికి అభిషేకం

పోలవరం, మే 18 : అంజనేయస్వామి ఆలయ సమీపంలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీచక్ర సహిత శ్రీనగరేశ్వరస్వామికి వాసవీ కన్యకాపరమేశ్వరికి శనివారం పంచామృత అభిషేకాలు, ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు మండవల్లి నాగవీరభద్రరావు, మండవల్లి శ్రీను, చోడిశెట్టి గోపి, రాంబాబు, మద్దుపోశీశ్వరావు, రేణుకేశ్వరరావు, రేషన్ డీలర్ల అధ్యక్షులు బాబు, ఆలయ అర్చకులు వేద పండితుడు పైడిపల్లి ఫణికుమార్ శర్మ పాల్గొన్నారు.

సత్యదేవుని 60వ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

లింగపాలెం, మే 18 :శ్రీభూదేవి నీలాదేవి సహిత శ్రీసత్యనారాయణస్వామి తిరుకల్యాణ మహోత్సవ కార్యక్రమం శనివారం కన్నుల పండువగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని రెండో అన్నవరంగా ప్రసిద్ధిచెందిన లింగపాలెం మండలం రంగాపురంలో శ్రీసత్యదేవుని ఆలయంలో 60వ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఉదయం పాంచరాత్ర ఆగమనం ప్రకారం స్వామి అమ్మవార్లను ఆలయ అర్చకులు వధూవరులుగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 22వ తేదీన స్వామివారి బ్రహ్మోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన పూజారి శేషాచార్యులు తెలిపారు.

21నుంచి శ్రీవారి వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాలు

ఏలూరు కల్చరల్, మే 18: శనివారపుపేట గాలి గోపురం పక్కనే ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు శ్రీస్వామి వారి 63వ వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. దీనికి సంబంధించి శనివారం ఆలయ ప్రాంగణంలో ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. 21న స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం అభిషేకం, పెండ్లికుమారుని చేయుట, 22న స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం జరుపనున్నట్లు తెలిపారు. 23న ప్రత్యేక కార్యక్రమాలు, పూర్ణాహుతి, 24న పవళింపుసేవ, 26న అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు వేసవి వినోద, విజ్ఞాన శిబిరాలు



క్యారం బోర్డు ఆడుతున్న విద్యార్థులు

ఏలూరు టూ టౌన్, మే 18: వేసవి సెలవుల్లో విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించేందుకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు హేలాపూరి చిల్డ్రన్స్ క్లబ్ నిర్వాహకురాలు శారద తెలిపారు. హేలాపూరి చిల్డ్రన్స్ క్లబ్ ప్రజా సంఘాల సహకారంతో వేసవి వినోద విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి దుర్గాప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు ఆట, పాట, డ్యాన్స్, చిత్రలేఖనం, మ్యాథమెటిక్స్, దేశనాయకుల జీవిత చరిత్రలు, తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్ఐ, ఐద్వా, కేబీఆర్ విజ్ఞాన కేంద్రం, ప్రజా సంఘాల సహకారంతో నిర్వహిస్తున్నామని శారద తెలిపారు. చిత్రలేఖనం, కేరం బోర్డు, జీవితచరిత్రలపై శనివారం తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో ఉషా, అశ్విని, రాజేశ్వరి, ఎం.దుర్గా, క్రాంతి, కె.లెనిన్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు హైమావతి, ఉషారాణి, పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత



స్ట్రాంగ్ రూం వద్ద సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న జేసీ లావణ్యవేణి

పెదపాడు, మే 18 : ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నామని దెందులూరు నియోజకవర్గ ఆర్వో, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. వట్లూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంను శనివారం జేసీ పరిశీలించారు. ఆర్వో లావణ్యవేణి మాట్లాడుతూ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. తహసీల్దారు వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి స్వీయ రక్షణ ఎంతో అవసరం



ప్రశంసా పత్రాలు అందజేసిన దిశా డీఎస్పీ మురళీకృష్ణ

ఏలూరు రూరల్, మే 18: నేటి సామాజిక పరిస్థితుల్లో మహిళలు, విద్యార్థినులు, యువతులు, ప్రతి ఒక్కరికి స్వీయరక్షణ ఎంతో అవసర మని దిశా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ మురళీకృష్ణ అన్నారు. స్థానిక వైఎంహెచ్ఏ ప్రాంగణంలో పదిహేను రోజులుగా 50 మందికి పైగా బాలికలకు శారీరక ధృడత్వం, స్వయం రక్షణ, యోగా, ధ్యాన తదితర అంశాల్లో శిక్షణ అందించారు. దీనిలో భాగంగా కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి శిక్షణలో ప్రతిభ పొందిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా దురుసుగా ప్రవర్తించిన సమయంలో తమను తాము రక్షించుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో ఉపయోగపడతాన్నాయన్నారు. శిక్షణ ఇచ్చిన ఆర్.వేణుగోపాల శ్రీనివాస్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎంహెచ్ఏ మేనేజ్‌మెంట్ కమిటీ ఇన్‌చార్జి, ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు, మజ్జి కాంతారావు, ఎం.సూర్యనారాయణ, వరప్రసాదరావు, ఎం.మహాలక్ష్మి, బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

పెదపాడు, మే 18 : వట్లూరు రైతు భరోసా కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువులు జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను రాయితీపై అందజేస్తున్నట్లుగా మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. వట్లూరు ఆర్బీకే వద్ద రైతులకు పచ్చిరొట్ట ఎరువులను శనివారం అందజేశారు. ఏవో ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువు 50 శాతం రాయితీపై, అలాగే జీలుగు కేజీ రూ.88లు, జనుము రూ.88లు, పిల్లిపెసర కేజీ రూ.134లు కాగా వీటిని 50 శాతం రాయితీపై రైతులకు అందజేస్తామన్నారు. పచ్చిరొట్ట ఎరువు వల్ల నేల గుల్లగా మారడంతో పాటుగా నేలలో సూక్ష్మజీవుల చర్యతో సారవంతమవుతుందన్నారు. రైతులు రాయితీపై పచ్చిరొట్ట ఎరువులను ఆర్బీకే వద్ద పొందాలని సూచించారు.

హామీల అమలులో మోదీ విఫలం

టి.నరసాపురం, మే 18: ఎన్నికల హామీలు అమలులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఘోరంగా విఫలమయ్యారని సీపీఐ ఏలూరు జిల్లా కౌన్సిల్ సభ్యులు టీబీఎస్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా అన్యాయం చేసిందన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు ప్రత్యేక హోదా, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు, ఉత్తరాంధ్ర రాయలసీమ వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజి అందిస్తామని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగు, తాగునీరు అందిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా మళ్లీ ఇప్పుడు రాబోయే రెండేళ్లల్లో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని మోదీ ప్రజలను మాటల గారడీతో మోసం చేస్తున్నారని విమర్శించారు. విదేశాల్లో దాచుకున్న నల్లధనాన్ని బయటకు తీసి ప్రతి పేదవానికి రూ.15 లక్షలు అకౌంట్‌లో వేస్తానన్న హామీని మోదీ గాలికి వదిలేశారని విమర్శించారు.

పోటీలో అత్యధికులు

బుట్టాయగూడెం మండలం వారే

బుట్టాయగూడెం, మే 18: సార్వత్రిక ఎన్నికల్లో పోలవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన వారిలో అత్యధికులు బుట్టాయగూడెం మండలం వారు కావడం విశేషం. పోలవరం అసెంబ్లీకి నామినేషన్ల పరిశీలన అనంతరం 12 మంది మిగిలారు. వీరిలో ఎనిమిది మంది బుట్టాయగూడెం మండలం నుంచి పోటీ చేయగా నలుగురు జీలుగు మిల్లి మండలం నుంచి పోటీలో ఉన్నారు. బీఎస్పీ నుంచి మడకం వెంకటేశ్వరావు బుట్టాయగూడెం మండలం కొమ్ముగూడెంకు, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన దువ్వెల సృజన బుట్టాయగూడెం మండలం కోయ రాజమండ్రికి వైసీపీ తరపున పోటీ చేసిన తెల్లం రాజ్యలక్ష్మీ కూడా బుట్టా యగూడెం మండలం దుద్దుకూరుకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడిగా అభ్యర్థిగా పోటీ చేసిన చిర్రి బాలరాజు జీలుగుమిల్లి మండలం బర్రింకల పాడు, గోండ్వానా దండ కారుణ్య పార్టీ నుంచి పోటీ చేసిన మడకం వెంకటేశ్వరావు జీలుగుమిల్లి మండలం మడకంవారిగూడెంకు, భారత్ ఆదివాసీ పార్టీ తరపున పోటీ చేసిన మొడియం శ్రీనివాసరావు జీలుగుమిల్లి మండలం చంద్రమ్మ కాలనీ చెందిన వారు. యువతరం పార్టీ నుంచి పోటీ చేసిన ఉయికె మంగమ్మ జీలుగుమిల్లి మండలం దిబ్బగూడెంకు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ తరపున పోటీ చేసిన సరియం రామ్మోహన్ బుట్టాయగూడెం మండలం కుమ్మరికుంటకు, బుట్టాయగూడెం మండలం నుంచి స్వతంత్రులుగా పోటీ చేసిన మొడియం సూర్యచంద్రరావు (మెట్టగూడెం), కాకి కృష్ణ(కోయ అంకంపాలెం), బాడిస బుజ్జిదొర (పడమట రేగులకుంట), పరియం సూరమ్మ (బండార్లగూడెం) గ్రామాలకు చెందిన వారే.

పందెం రాయుళ్లకు పండగొచ్చింది

- ఓటర్ల మనోగతంపై బెట్టింగ్ రాయుళ్ల ఆరా..
- వైసీపీ పథకాలకు ఓటేశారా..
- టీడీపీ సూపర్ సిక్స్‌కు తలొగ్గారా..
- వాడీవేడిగా చర్చలు

పెదవేగి, మే 18 : పందేలరాయుళ్లకు పండగొచ్చింది. సంక్రాంతిని మించిన పండుగ. అదే ఎన్నికల పండుగ. సంక్రాంతినాడు కోడిపందాలపై పందేలు జరుగుతాయి. కానీ ఈ పండుగలో ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులపై జరుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నాటి నుంచి బెట్టింగ్ రాయుళ్లు పందేలు కాయడానికి సర్వేలు చేస్తున్నారు. ఓటర్లు నాడి ఎలా ఉంది.. ఓటు ఎవ్వరికి వేసి ఉంటారు.. మహిళలు ఎటువైపు మొగ్గారు.. సామాజిక వర్గాల పరంగా ఏ వర్గం ఎవ్వరికి ఓటు వేశారు.. ఫలితం ఎటువైపు మొగ్గుతోంది.. విజయావకాశాలు ఏ పార్టీకి ఎక్కువగా కనిపిస్తు న్నాయి. అనేదానిపై బెట్టింగ్ రాయుళ్ల సర్వేలు చేస్తూ ఆయా పార్టీల విజయావకాశాలపై అంచనాలు వేసుకుంటూ పందేలు ఒడ్డడానికి సిద్ధమవుతున్నారు. ఎవరికి విజయావకాశాలు ఉన్నాయనేదానిపై పందెం రాయుళ్ల గ్రామాల్లో సర్వేలు కూడా చేస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో నెల రోజులుగా పందేల జోరుగా సాగుతున్నాయి. తొలుత సమంగా సాగిన పందెం.. ఇప్పుడు టీడీపీ అభ్యర్థి గెలుపుపై హెచ్చుగా సాగుతోంది. టీడీపీ అభ్యర్థి గెలిస్తే రూ.లక్ష, అదే వైసీపీ అభ్యర్థి గెలిస్తే రూ.లక్షన్నరగా పందేలు కాస్తున్నారు. దెందులూరుతో పాటు నూజివీడు, గన్నవరం మూడు సీట్లపై పందేంలు జరుగుతున్నాయి. దీంతోపాటు వైసీపీకి 70 స్థానాలు కూడా రావని పందేలు కాస్తున్నారు. సీట్లతోపాటు అభ్యర్థులకు వచ్చే మెజారిటీపైనా పందేలు జోరుగా సాగుతున్నాయి.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి



నూజివీడు సీడ్స్ ప్లాంట్‌ను తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

పెదవేగి, మే 18 : దిగుబడులను పెంచే నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్కే. హబీబ్ బాషా విత్తన ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులకు సూచించారు. విజయరాయిలోని నూజివీడు సీడ్స్ ప్లాంట్‌ను శనివారం తనిఖీ చేసిన ఆయన విత్తనశుద్ధిని పరిశీలించారు. అలాగే ప్లాంట్ లైసెన్స్, రిజిష్టర్లు, ఇన్ వాయిస్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిగుబడులు పెరగాలంటే విత్తన ఎంపిక కీలకమన్నారు. ఈ విషయంలో విత్తన ప్రాసెసింగ్ యూనిట్ యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండి, మేలైన విత్తనాలను సేకరించి, విక్రయించాలని ఆయన సూచించారు. విత్తన ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులు ప్రభుత్వం సూచించిన అన్ని ప్రమాణాలు పాటించాలన్నారు. విజయరాయిలో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన ఆయన పచ్చిరొట్ట పైరు ఉపయోగాలను రైతులకు వివరించారు. పంట భూమిలో పచ్చిరొట్ట పైరులను సాగు చేసి, వినియోగించడం ద్వారా భూసారం పెరుగుతుందని, తద్వారా ఎరువుల వ్యయం తగ్గుతుందని ఆయన తెలిపారు. 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట పైరు విత్తనాలను అందిస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, భూసారాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఏడీఏ సుబ్బారావు, పెదవేగి మండల వ్యవసాయాధికారిణి ఎం.ప్రియాంక, వీహెచ్ఏలు బషీర్, ప్రణీత్‌వర్మ, రైతులు పాల్గొన్నారు.

వారమంతా

కూల్ కూల్

- మరో మూడు రోజులు జిల్లాలో చల్లదనం
- తరువాత మళ్లీ ఎండలు పెరిగే అవకాశం

ఏలూరు రూరల్, మే 18: ఎండలు మండిపోవాల్సిన సమయంలో వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఇన్ని రోజులు అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కబోతతో ఇబ్బందులు పడిన ప్రజలు చల్లటి వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. మరో మూడు రోజుల పాటు ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. కొద్ది రోజుల వరకు జిల్లాలో 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రత మరింత పెరుగుతాయని ప్రజలు భయపడ్డారు. కాని కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో ఊపిరిపీల్చుకుంటున్నారు. మేఘాల్లో వచ్చిన వ్యత్యాసమే ఈ మార్పుకు కారణమని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఆకాశం మేఘావృతం కావడంతో ఈ మేఘాలు కొంతమేర కిందకు దిగి ఉంటాయని పేర్కొంటున్నారు. ఒరిస్సా నుంచి కేరళ వరకు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో పాటు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాన్ని ఒక కారణంగా చెబుతున్నారు. ఈ రెండింటి కారణంగానే వాతావరణంలో మార్పులు వచ్చాయంటున్నారు. ఈ వాతావరణం ఈ మూడు రోజులు మాత్రమే ఉంటుందని ఆ తరువాత మళ్లీ ఉష్ణోగ్రతలు పెరుగుతాయని చెబుతున్నారు. ఈ నెల 23 నుంచి రోహిణికార్తె మొదలు కానుందని, 25 వరకు ఎండలు ఉంటాయని అనుకుంటున్నారు. ఏది ఏమైనా మరి కొన్ని రోజులు జిల్లా వాసులు చిరుజల్లులతో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందనున్నారు. వాతవరణం చల్లబడడంతో మార్కెట్‌లు కళకళలాడుతున్నాయి.

విజయం సాధిస్తాం

మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ



పాతూరులో జరిగిన ఎన్నికల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మురళీ రామకృష్ణ

కామవరపుకోట, మే18 : సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తలు వైసీపీని ఓడించాలనే లక్ష్యంతో ఐక్యంగా పని చేశామని తప్పక విజయం సాధిస్తామని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. పాతూరులోని మురళీ నివాసంలో శనివారం ఎన్నికల తీరుపై నాయకులు కార్యకర్తలతో సమీక్షించారు. గ్రామాల వారిగా పోలింగ్ తీరుపై అభిప్రాయ సేకరణ జరిపారు. అనంతరం మురళీ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజున మరిన్ని జాగ్రత్తలు తీసకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ఫలితాలలో ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్‌కు, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి సొంగా రోషన్ కుమార్‌కు మండలంలో అత్యధిక ఓట్లు వస్తాయన్నారు. కూటమి నాయకులు జుజ్జూరి బాబ్జి, ఖాన్ వజీర్, డోలా విజయ్, తూతా లక్ష్మణరావు, బొప్పన అంజియ్య, గూడపాటి కేశవరావు, బేతిన వెంకట్రావు, గంటా మాధవరావు, షేక్‌వల్లీ, గోరింకదాసు తదితరులు పాల్గొన్నారు.

బూత్‌ల వారీగా పోలింగ్ ఇలా...

ఉంగుటూరు మండలం

బూత్ నంబరు	గ్రామం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
1.	యర్రమిల్లిపాడు	1167	1103	94.51
2.	నల్లమాడు	479	453	94.57
3.	కంసాలిగుంట	636	607	95.44
4,5	గొల్లగూడెం	2676	2443	91.30
6.	గోపాలపురం	1283	1180	91.97
7.	రామచంద్రపురం	613	588	95.92
8,9	అక్కుపల్లిగోకవరం	2491	2239	89.80
10,11	తిమ్మయ్యపాలెం	1218	1139	93.99
12,13	గోపీనాధపట్నం	1494	1388	93.12
14,15	నీలాద్రిపురం	1,645	1,545	93.88
16.	గుళ్ళపాడు	648	590	93.14
17.	యర్రమళ్ళ	1,095	998	91.14
18,19	నాచుగుంట	1,450	1358	93.59
20టు25	ఉంగుటూరు	6,220	5,435	87.37
26.	కాగుపాడు	1,373	1,200	87.40
27టు29	చినవెల్లమిల్లి	2,821	2,625	93.05
30,31	పెద వెల్లమిలి	1,947	1736	89.19
32టు34	బాదంపూడి	3,116	2,672	85.75
35,36	ఉప్పాకపాడు	1,903	1,748	91.85
3,38	బొమ్మిడి	1,927	1,754	91.02
39.	దొంతవరం	876	792	90.41
40,41	కాకర్లమూడి	1,235	1,108	89.77
42.	తోటరామచంద్రపురం	177	165	93.22
43.	వీఏపురం	732	640	87.43
44,45	రావులపర్రు	1,601	1,452	90.07
46,47	రాచూర	2,125	1,872	88.09
48.	సీతారాంపురం	760	699	91.97
49టు54	చేబ్రోలు	6,750	5,816	86.16
55టు59	నారాయణపురం	5,307	4,882	86.33
60.	తల్లాపురం	811	762	93.95.
61టు67	కైకరం	7,390	6,415	86.80
మొత్తం		63,976	57,404	89.2

లింగపాలెం మండలం

బూత్ నంబరు	గ్రామం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
201	కె.గోకవరం	873	792	90.72
202	కె.గోకవరం	886	777	87.69
203	అన్నపనేనివారిగూడెం	986	932	94.5
2204	పాశ్వానగరం	932	848	94.52
205	పాశ్వానగరం	762	657	86.22
210	యడవల్లి	1,185	1,075	90.72
211	యడవల్లి(39)	1,190	1,085	91.18
212	సింగగూడెం	983	921	93.69
213	సింగగూడెం	940	878	93.40
214	కొత్తపల్లి	822	759	92.21
215	కొత్తపల్లి	535	505	94.39
216	కొత్తపల్లి	1,073	994	92.63
217	కుప్పాలవారిగూడెం	1,006	935	92.94
218	గణపవారిగూడెం	746	682	91.42
219	వేములపల్లి	973	879	90.33
220	వేములపల్లి	885	809	91.41
221	ఆసన్నగూడెం	1,279	1176	91.94
240	బాదరాల	705	658	93.33
241	ముడిచర్ల	890	806	90.56
242	ముడిచర్ల	813	728	89.54
243	ములగలంపాడు	767	710	92.56
244	ములగలంపాడు	740	689	93.10
245	రంగాపురం	940	926	87.87
246	రంగాపురం	846	763	90.18
247	బోగోలు	899	822	91.83
248	బోగోలు	894	804	89.93
249	బోగోలు	710	645	90.84
250	నరసన్నపాలెం	1065	965	90.61
251	తిమ్మక్కపాలెం	1090	989	90.73
252	లింగపాలెం	864	749	86.68
253	లింగపాలెం	802	725	90.39
254	కల్యాణంపాడు	636	573	90.09
255	కల్యాణంపాడు	548	486	88.69
256	టీసీహెచ్‌ఆర్‌కాలనీ	1170	1028	87.86
257	టీసీహెచ్‌ఆర్‌కాలనీ	1204	1093	90.78
258	మటంగూడెం	1216	1058	87.00
259	మటంగూడెం	1137	1018	89.53
260	కొణిజర్ల	781	724	92.70
261	ధర్మాజీగూడెం	1117	895	80.12
262	ధర్మాజీగూడెం	916	769	83.95
263	ధర్మాజీగూడెం	1011	930	83.70
264	ధర్మాజీగూడెం	1224	1010	83.19
265	ధర్మాజీగూడెం	808	657	81.31
266	ధర్మాజీగూడెం	817	700	85.67
267	ధర్మాజీగూడెం	907	772	85.11
268	కలరాయునిగూడెం	1014	970	87.07
269	కలరాయునిగూడెం	1103	1080	91.38
270	అయ్యప్పరాజుగూడెం	1159	1038	89.55
271	అయ్యప్పరాజుగూడెం	1243	1079	86.80
272	అయ్యప్పరాజుగూడెం	642	572	89.09

విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు

లింగపాలెం, మే 18: ధర్మాజీగూడెం శాఖ గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నీతికథలు చదివించి, రాయించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. చెస్, మైండ్ మెమోరి గేమ్స్ తదితర ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సీహెచ్ వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత జయంత్యుత్సవం

ఏలూరు కార్పొరేషన్, మే18, నగరంలోని ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. అగ్రహారంలోని నగరేశ్వరస్వామి ఆలయం వద్ద, కన్యకాపరమేశ్వరి సత్రం వద్ద వేడుకలలో అమ్మవారికి అభిషేకాలు, కన్యలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వాసవీ అమ్మవారిని హంసవాహనంపై ఊరేగించారు. భక్తులకు ఆర్యవైశ్య సంఘాల నాయకులు భారీ అన్న ప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు, యువకులు, మహిళా ప్రతినిధులు భక్తులకు సేవలందించారు.



సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న కన్యలు



కలశాలతో ఊరేగుతున్న ఆర్యవైశ్య మహిళలు

కామవరపుకోటలో....

గ్రామంలోని శ్రీసీతారామాలయం ప్రాంగణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద శనివారం ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతిని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు, సామూహిక కుంకుమపూజలు జరిపారు. కమిటీ వారు భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు బచ్చు ముత్యాలరావు, వంకదార ఉదయ్, కొండూరు రామకృష్ణ, వందనపు మురళీ, వాసా సుబ్రహ్మణ్యం, కొనకళ్ళ కాళీ, తుమ్మలపల్లి శ్రీనివాసరావు, పత్తి కుమార్ బృందం సేవలందించారు.

108 కలశాలతో గ్రామోత్సవం

చింతలపూడి : వాసవీమాత జయంతి సందర్భంగా పట్టణ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రామోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం కోదండ రామాలయంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం సాయిరామ్ సెంటర్లోని ఆంజనేయస్వామి గుడి నుంచి అమ్మవారి రథాన్ని మహిళలు, పురుషులు లాగుతూ 108 కలశాలతో, పాతబస్టాండ్ ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకుని పూజలు జరిపి, అక్కడి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా వీకేఎం ఫంక్షన్ హాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పట్టణశాఖ అధ్యక్షులు వజ్రపు శేఖర్, కొనకళ్ల ప్రసాద్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పట్టణంలోని ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు, కుటుంబాలతో పాల్గొన్నారు.

టి.నరసాపురం : బొర్రంపాలెంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంచినీటి బోరుకు మోటారు

టి.నరసాపురం, మే 18 : మక్కినవారిగూడెం పంచాయతీలోని సంగారావుపేటలో దామిశెట్టి విశ్వనాథం, వెంకటరత్నం జ్ఞాపకార్థం వారి కుమారుడు దామిశెట్టి కేశవరావు, కమల దంపతులు గ్రామస్తుల తాగునీటి సమస్య తీర్చేందుకు బోరు వేయించి మోటారు అమర్చారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని అన్నారు.



దాత వేయించిన బోరు నుంచి నీరు పట్టుకుంటున్న మహిళలు

అభ్యర్థుల్లో క్రాస్ ఓటింగ్ భయం



ముదినేపల్లి రూరల్, మే 18: ఎన్నికల్లో ఇరుపార్టీలు పోటాపోటీగా నగదు పంపిణీ చేయడంతో ఓటర్లు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. ఈ క్రాస్ ఓటింగ్ ఎవరికి లాభం ఎవరికి నష్టం అనే విషయమై గ్రామాల్లో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఒక్కో గ్రామంలో ఒక్కో విధంగా క్రాస్ ఓటింగ్ జరిగిందని గ్రామ స్థాయి నాయకులు చెబుతున్నారు. నగదు పంపిణీ ఇరుపార్టీలు సమానంగా చేయడంతో ఎంపీ ఓటు ఫ్యాన్ గుర్తుకు ఎమ్మెల్యే ఓటు కమలం పువ్వుకు బారీస్థాయిలో ఓట్లు పోలైనట్లు గ్రామాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది. లెక్కింపు సమయం దగ్గర పడుతున్న కొద్ది నాయకుల్లో టెన్షన్ టెన్షన్ నెలకొంటుంది.

గ్రామాల్లోనూ కాయ్ రాజా కాయ్



ముదినేపల్లి, మే 18 : సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై బెట్టింగులు గ్రామాలకు పాకాయి. గతంలో పట్టణాల్లోనే, నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే పందేలు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఊపందుకున్నాయి. పోలింగ్ సరళిని గత నాలుగు రోజులుగా పరిశీలించిన పందెం రాయుళ్లు వివిధ సర్వేల ఆధారంగా పందేలకు రంగంలోకి దిగుతున్నారు. పందేలకు యువకులు హుషారు కనబరుస్తున్నారు. ఎన్నికల ఫలితాలపై విదేశాల్లో ఉన్న వారు సైతం తమ బంధువులకు, స్నేహితులకు డబ్బు పంపించి పందేలు కాయిస్తున్నారు. ముదినేపల్లి ప్రాంతంలో గతంలో ఏనాడు లేని విధంగా పందేలు జోరుగా సాగుతున్నాయి. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అధిక సంఖ్యలో పందేలు కాస్తుండగా, వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని మరి కొందరు పందేలకు దిగుతున్నారు. విదేశాలతోపాటు హైదరాబాద్, బెంగుళూరు తదితర ప్రాంతాల్లో స్థిరపడిన ముదినేపల్లి ప్రాంతం వారు ఎన్‌డీఏ కూటమి విజయంపైనే ఎక్కువగా పందేలు కడుతున్నారు. కైకలూరు నియోజకవర్గ ఫలితంతో పాటు గుడివాడ, పెడన నియోజకవర్గాల ఫలితాలపై కూడా పెద్ద ఎత్తున పందేలు కాస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగులు కూడా జోరుగా సాగుతు న్నట్లు తెలిసింది. ప్రముఖులు పోటీ చేసిన కుప్పం, పిఠాపురం, మంగళగిరి, పులివెందుల ఉండి నియోజకవర్గాల్లో మెజార్టీలపై కూడా పందేలు కడుతున్నారు.

పోటీలో విరోధులు - పంపిణీలో సహోదరులు

ఓట్ల కొనుగోళ్లలో అభ్యర్థులది ఒకటే దారి

ముదినేపల్లి, మే 18 : ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు విజయం సాధించేందుకు ఎవరికీ వారే తమ ఇష్టానుసారంగా రాజకీయాలు చేస్తుంటారు. అయితే ఓటర్లకు డబ్బుల పంపిణీ దగ్గరకు వచ్చే సరికి ఒకటే నిర్ణయం. పోలింగ్‌కు ముందు నాలుగు రోజుల నుంచి ఓటర్లకు డబ్బుల పంపిణీపై పార్టీల తర్జన, భర్జనలు జరుగుతూనే ఉన్నాయి. ఒక అభ్యర్థి ఎక్కువ, మరో అభ్యర్థి తక్కువ కాకుండా ఇద్దరూ సమానంగా డబ్బు పంపిణీ చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. అయితే ఓటు రేటు మాత్రం గత ఎన్నికల కంటే రెట్టింపు చేశారు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో విధంగా డబ్బు పంపిణీ చేసినా ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ సమానంగానే ఇచ్చారు. ఇరు పార్టీల అభ్యర్థులు కొంతమంది నాయకుల మధ్య వర్తిత్వంతో ఒక అవగాహనకు వచ్చి ఓటుకు రేటు నిర్ణయించుకుని పంపిణీ చేశారు. ముదినేపల్లికి సరిహద్దుల్లో ఉన్న ఒక నియోజకవర్గంలో ఇరువురు అభ్యర్థులు ఓటుకు రూ.1000లు పంపిణీ చేయగా, మరో నియోజకవర్గంలో ఓటుకు మూడు వేలు, ఇంకో నియోజకవర్గంలో ఓటుకు రెండు వేలు పంపిణీ చేశారు. ఒక వేళ ఏదైనా నియోజకవర్గంలో ఒక అభ్యర్థి ఎక్కువ డబ్బు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నా అవతలి పార్టీ అభ్యర్థి మధ్యవర్తులతో సంప్రదింపులు జరిపించి ఎంత ఇచ్చినా ఒక్కటే ఓటు చేరొకటి వేస్తారు సమానంగా ఇద్దాం అంటూ అవగాహనకు రావటం ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది.

టీటీడీకి నూజివీడు మామిడి, కూరగాయలు



నూజివీడు, మే 18: తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని అన్నదాన ట్రస్ట్‌కు నూజివీడు రైతులు స్వచ్ఛందంగా తమ ఫలసాయాన్ని అందించారు. నూజివీడు మండలం దేవరగుంట గ్రామానికి చెందిన రైతు నక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో మామిడి, సొర, క్యాబేజి, అరటి తదితర కూరగాయలు సుమారు రూ. 2 లక్షలు విలువచేసే మొత్తం 12 టన్నులను స్వామివారి సన్నిధికి పంపించారు. దీనిని వెంగమాంబ అన్నదాన సత్రంలో భక్తుల అన్నదాన కార్యక్రమానికి వినియోగించనున్నట్లు నక్కా సత్యనారాయణ తెలిపారు.

నేటి నుంచి శ్రీవారి కల్యాణోత్సవాలు

కలిదిండి, మే 18 : కలిదిండిలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 19 నుంచి ఐదు రోజులపాటు నిర్వహిస్తున్నామని ఆలయ మేనేజర్ బి.గోపాలరావు తెలిపారు. 19న స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరణ, 20న విశేష పూజలు, నిత్య హోమం, 21న స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహిస్తారన్నారు. 22న గ్రామోత్సవం, 23న పవళింపు సేవ, 25న అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయానికి రంగులు వే సి విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ ఛైర్మన్ బోయిన రామకృష్ణ, ధర్మకర్తలు ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

22 నుంచి సోమేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు

ముదినేపల్లి, మే 18 : ఉమ్మడి కృష్ణా జిల్లాలో అతి పురాతన ఆలయాల్లో ఒక్కటైన ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామంలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. 22న స్వామి, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేయటం, 23న కల్యాణం, 24న ఊరేగింపు, పవళింపు సేవ జరుగుతాయి. నిత్యం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 300 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఏడాదికి ఒకసారి జరిగే కల్యాణోత్సవాలకు పలు గ్రామాల నుంచి భక్తులు తరలివస్తారు.

భగవద్గీత శ్లోకాలపై పోటీలు

కైకలూరు, మే 18: వికాస తరంగిణి ఆధ్వర్యంలో వేసవిలో విద్యార్థులకు భగవద్గీతపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. శనివారం కైకలూరు మీసాల వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేసవిలో పిల్లలకు భగవద్గీత శ్లోకాలు, భజన కీర్తనలు, యోగా, సూర్య నమస్కారాలు, కోలాటం శిక్షణా తరగతులను వికాస తరంగిణి చీఫ్ కోఆర్డినేటర్ చిట్టి హేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కోఆర్డినేటర్లు ఎస్. మాధవి, చైతన్య రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎల్‌కు ఎన్ఆర్ఐ విద్యార్థి ప్రకాష్ ఎంపిక



ఆగిరిపల్లి, మే 18: ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం డేటా సైన్స్ విద్యార్థి తాతా సాయి ప్రకాష్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ బెజవాడ టైగర్స్ జట్టుకు ఎంపిక అయ్యాడు. సాయి ప్రకాష్ చదువుతో పాటు అదనపు క్రీడాంశాల మీద శ్రద్ధ చూపి రాణించినందుకు కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ నాగభాస్కర్, ప్లేస్మెంట్ డైరెక్టర్ ఎస్‌వీ సురేంద్ర, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్.మాధవరావు తదితరులు అభినందించారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

చాట్రాయి, మే 18: 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తామని, కావల్సిన రైతులు తమ పేర్లు స్థానిక ఆర్బీకేలలో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి శివశంకర్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొలకరి వర్షాలు కురవగానే భూముల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లి పూతదశలో దున్నటం వల్ల నత్రజని, భాస్వరం, పొటాష్ సేంద్రియ పదార్థం భూమికి సమపాళ్ళలో అందటమే కాక కలుపును నివారించి భూమిని గుల్ల పరుస్తుందన్నారు. రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు అధిక మోతాదులో వాడటం వల్ల నేలలో మేలు చేసే సూక్ష్మజీవులు తగ్గి భూమికి సేంద్రియ పదార్థం అందటం లేదని, ఫలితంగా దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. సబ్సిడీ పోను జీలుగ, జనుము 1 కేజీకి రూ. 44, పిల్లిపెసర కేజీ విత్తనాలకు రూ. 67 చెల్లించాలని ఏవో తెలిపారు.



నూజివీడు ఎస్ఎస్‌పీ కాలనీలో అసంపూర్తిగా నిలిచి చిట్టడవిలా దర్శనమిస్తున్న ఇండోర్ స్టేడియం

ఇండోర్ స్టేడియం కలేనా...

క్రీడలకు పుట్టినిల్లుగా చెప్పే నూజివీడులో క్రీడాకారులకు సదుపాయాలు మాత్రం ఆమడ దూరంలోనే ఉంటున్నాయి. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం శంకుస్థాపన చేసిన నూజివీడు ఇండోర్ స్టేడియం నేటికీ పూర్తి కాకుండా ఇదిగో ఇలా చిట్టడవిని తలపిస్తూ నిలిచిపోయింది. ఒకరికి పేరు వస్తుందనే కారణంతో ప్రభుత్వాలు ప్రజాప్రయోజన నిర్మాణాలను పట్టించుకోకపోవడంతో కోట్లాది రూపాయల నిధులు ఇదిగో ఇలా వ్యర్థమవుతున్నాయి.

- 40 ఏళ్ల క్రితం శంకుస్థాపన!
- నేటికీ పూర్తికాని నిర్మాణం
- నిధుల కొరతతో పూర్తికాని పనులు
- కొత్త ప్రభుత్వంపైనే క్రీడాభిమానుల ఆశలు

నూజివీడు టౌన్, మే 18: నూజివీడు ఎస్ఎస్‌పీ కాలనీలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి దాదాపు 40 ఏళ్ల క్రితం కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి హయాంలో శంకుస్థాపన చేశారు. మాజీ మంత్రి, దివంగత ఎమ్మెల్సీ పాలడుగు వెంకట్రావు ఆధ్వర్యంలో శంకుస్థాపన జరగ్గా పునాదిరాయి పడటానికి దాదాపు 30 ఏళ్ల కాలం గడిచిపోయింది. కిరణ్ కుమార్‌రెడ్డి హయాంలో ఎట్టకేలకు పునాదిరాయి పడినా నిధుల కొరతతో దాదాపు 80 శాతం పనులు పూర్తి చేసుకున్న ఇండోర్ స్టేడియం నిలిచిపోయింది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంతో స్టేడియం ప్రాంగణం మొత్తం పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తోంది. దీనిపై క్రీడాభిమానులు అనేకమంది పలు సందర్భాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళినా అసలు ఈ నిర్మాణం ఏ శాఖ అనుమతులతో చేపట్టారో తెలియదని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారే కానీ నిరుపయోగంగా మారుతున్న కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వినియోగంలోకి తీసుకువద్దామనే ఆలోచన మాత్రం లేదు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని చేపట్టబోయే ప్రభుత్వమైనా ఈ ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని పట్టించుకుంటుందా? లేక? ఈ చిట్టడవిలో ఇండోర్ స్టేడియం కనుమరుగు అవ్వాల్సిందేనా అనే ప్రశ్న క్రీడాకారుల్లో నెలకొంది. ఇప్పటికే రెండు తరాల క్రీడాకారులకు అందని ద్రాక్షలా మారిన ఈ స్టేడియం ను భవిష్యత్ క్రీడాకారులకైనా అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాద దృశ్యం.. (ఇన్‌సెట్) క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

టైరు పేలి.. ఆటోను ఢీకొన్న పెట్రోల్ ట్యాంకర్

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- ట్యాంకర్ బోల్తాతో లీకైన పెట్రోల్, డీజిల్
- చర్యలు చేపట్టిన అగ్నిమాపక, పోలీస్ శాఖలు
- ఊపిరి పీల్చుకున్న స్థానికులు

నూజివీడు టౌన్, మే 18: పెట్రోల్ ట్యాంకర్ టైర్ పేలి ట్యాంకర్, ఆటో ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన నూజివీడు మండలం మీర్జాపురం వద్ద చోటుచేసుకుంది. నూజివీడు నుంచి ఏలూరు వెళుతున్న పెట్రోల్ ట్యాంకర్ మీర్జాపురం వద్ద ముందు భాగంలోని ఎడమ టైర్ పేలి పోవడంతో ట్యాంకర్ అదుపుతప్పి హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు వస్తున్న ఆటోను ఢీ కొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న విశాఖపట్నం గాంధీనగర్‌కు చెందిన కురందాస్ గోవింద్, కురందాస్ ఆదిలక్ష్మి, కురందాస్ రత్నం, అరసా ప్రసాద్‌తో పాటు తణుకు మండలం పైడిపర్రుకు చెందిన దూళ్ళ నాగపెద్దిరాజు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో 108 సిబ్బంది క్షతగాత్రులను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. కాగా పెట్రోల్ ట్యాంకర్, ఆటోను ఢీ కొన్న అనంతరం పల్టీ కొట్టడంతో ట్యాంకర్ నుంచి పెట్రోల్, డీజిల్ లీకవడంతో సంఘటనా స్థలంలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో నూజివీడు అగ్నిమాపక సిబ్బంది, పోలీస్ శాఖ ఘటనా స్థలానికి చేరుకుని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. దీంతో చుట్టుపక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు.

వరుడైన చిన వెంకన్న

ద్వారకా తిరుమలలో వైశాఖ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శ్రీవారి దర్శనార్థం ఎండలో బారులు తీరిన భక్తులు



మహావిష్ణువు అలంకరణలో శ్రీవారు

ద్వారకాతిరుమల, మే18: ద్వారకాతిరుమల శ్రీవారి వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి ఆలయ నిత్యకల్యాణ మండప ఆవరణలో విశేష అలంకరణలో అలివేలు మంగ, ఆండాళ్ అమ్మవార్లు కొలువుతీరగా.. నడుమ ఉన్న చిన్నతిరుమలేశుడు పెండ్లి కుమారునిగా ముస్తాబయ్యారు. ఉభయదేవేరులు పెండ్లి కుమార్తెలయ్యారు. ఉదయం ఏర్పాటు చేసిన సువర్ణ సింహాసనంపై స్వామి, అమ్మవార్ల కల్యాణమూ ర్తులను ఉంచి ఆలయ అర్చకులు హారతులిచ్చి ఈ తంతును నిర్వహించారు. ఆలయ ఈవో త్రినాథరావు ఆద్యంతం పాల్గొని అర్చకులు, పండితులకు దీక్షా వస్త్రాలను అందచేసి అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

శ్రీ భూ సమేత మహావిష్ణువుగా శ్రీవారు

ఆదిశేషుని పడగన శ్రీభూసమేత మహావిష్ణువు అలంకరణలో శ్రీవారు ఆలయ ప్రాంగణములో భక్తజనులకు దర్శనమిచ్చారు. వైశాఖ మాస బ్రహ్మో త్సవాల్లో భాగంగా రోజుకో అలంకరణలో చినవెంకన్న సాక్షాత్కరిస్తారు.

గజ వాహనంపై శ్రీవారి రాజసం..



గజవాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

గజవాహనంపై ఉభయదేవేరులతో కొలువుతీరిన చిన వెంకన్న స్వామి క్షేత్రపురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల వాహనసేవల్లో భాగంగా తొలిరోజు శ్రీవారు, అమ్మవార్లు గజ వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో భక్తులను అభయహస్తాన్ని అందించారు. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లను గజవాహనంపై ఉంచి అలంకరించి మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ గ్రామంలో ఊరేగించారు.

భక్తులు ఫుల్.. సౌకర్యాలు నిల్

ఎండ తీవ్రతతో వృద్ధులు, మహిళల ఇబ్బందులు

చినవెంకన్న ఆలయం శనివారం భక్తజన సంద్ర మైంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజవడం వల్ల ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేలాదిగా వచ్చిన భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో దేవస్థానం విఫలమైంది. శ్రీవారి దర్శనం క్యూకాంప్లెక్స్‌లోని ఐదు కంపార్ట్ మెంట్‌లు నిండిపోయాయి. దాదాపు 30 వేల మంది వరకు యాత్రికులు రావడంతో క్యూకాంప్లెక్స్ ప్రాంతం నుంచి జంటగోపురాల ప్రాంతం వరకు బారులు తీరారు. శనివారం ఉదయం నుంచి భానుడు ఉగ్రరూపం దాల్చ డంతో విలవిల్లాడారు. చంటిపిల్లలతో మహిళలు, వృద్ధులు గంటల తరబడి ఎండలో నిలబడాల్సి వచ్చింది. కనీసం మంచినీటి సౌకర్యం కల్పించలేదని భక్తులు ఆవేదన చెందారు. తాత్కాలిక టెంట్లు, చలువ పందిళ్ల వంటివి ఏర్పాటు చేయలేదని వాపోయారు. అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు

నూజివీడు మండలంలో బూత్‌లవారీ పోలింగ్ ఇలా..

నూజివీడు టౌన్, మే 18: నూజివీడు మండలంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక, అత్యల్ప ఓటింగ్ వరుస కేంద్రాల్లో చోటుచేసుకోవడం విశేషం. పోలింగ్ బూత్‌నెం 121లో నూజివీడు మండలంలో అత్యల్పంగా 82.11శాతం ఓటింగ్ నమోదు కాగా, ఆ పక్క బూత్ అయిన వెంకటాయపాలెం గ్రామంలోని 122 బూత్ నెంబర్‌లో అత్యధికంగా 98.61శాతం ఓటింగ్ నమోదు అయింది.

బూత్ నంబరు	గ్రామం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
109	దిగవల్లి	1161	1094	94.23
110	దిగవల్లి	1057	999	94.51
111	మిట్టగూడెం	707	665	94.06
112	మిట్టగూడెం	670	603	90.00
113	తూర్పుదిగవల్లి	598	538	89.97
114	తూర్పుదిగవల్లి	865	826	95.49
115	ముక్కొల్లుపాడు	716	650	90.78
116	,,	605	573	94.71
117	,,	714	678	94.96
118	అన్నవరం	665	614	92.33
119	,,	807	712	88.23
120	,,	713	642	90.04
121	,,	844	693	82.11
122	,,	718	708	98.61
123	వెంకటాయపాలెం	653	618	94.64
124	,,	1054	991	94.02
125	హతియాతండా	805	760	94.41
126	నర్సుపేట	775	712	91.87
127	,,	645	578	89.61
128	సుంకొల్లు	1052	953	90.59
129	,,	699	660	94.42
130	,,	573	541	94.42
131	యనమదల	805	724	89.94
132	,,	569	522	91.74
133	,,	623	598	95.99
134	,,	921	849	92.18
135	బత్తులవారిగూడెం	623	618	93.21
136	కొత్తరావిచర్ల	822	716	87.10
137	,,	558	530	94.98
138	పాతరావిచర్ల	978	918	93.77
139	,,	740	681	92.03
140	బోర్వంచ	1080	918	85.00
141	,,	1075	1004	93.40
190	పోతురెడ్డిపల్లి	651	577	88.63
191	,,	1009	897	88.90
192	,,	673	615	91.38
193	,,	633	587	97.73
194	,,	313	297	94.89
195	తుక్కులూరు	577	514	89.08
196	,,	660	608	92.12
197	,,	613	539	87.93
198	తుక్కులూరు	806	712	87.34
199	రామన్నగూడెం	1037	909	87.66
200	మొర్సపూడి	1071	977	91.22
201	,,	955	877	91.83
202	మొర్సపూడి	686	623	90.82
203	,,	615	551	89.59
204	దేవరగుంట	870	789	90.69
205	,,	980	897	91.53
206	,,	1079	998	92.49
207	,,	1047	976	93.22
208	గొల్లపల్లి	759	658	86.69
209	,,	579	513	88.60
210	,,	856	795	92.87
211	వేంపాడు	303	276	91.09
212	మీర్జాపురం	877	788	89.85
213	,,	940	864	91.91
214	,,	888	788	88.74
215	,,	1110	1014	91.35
216	,,	959	830	86.55
217	,,	1068	980	91.76
218	మర్రిబంధం	930	802	86.24
219	,,	953	856	89.82
220	ఎంఎస్ పాలెం	751	658	87.62
221	,,	831	754	90.73
222	పల్లెర్లమూడి	1085	935	86.18
223	,,	1053	947	89.93
224	,,	901	812	90.12
225	,,	611	540	88.38
226	సీతారాంపురం	715	646	90.35
227	,,	709	634	89.42
228	,,	733	673	91.81

ముసునూరు మండలంలో బూత్‌లవారీ పోలింగ్ ఇలా..

ముసునూరు, మే 18: ముసునూరు మండలంలో మొత్తం 45,537 మంది ఓటర్లు ఉండగా, సార్వత్రిక ఎన్నికల్లో 41,155మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం 90.37గా నమోదైంది. మొత్తం 57 బూత్‌లలో ఓటింగ్ నిర్వహించారు. ప్రతి బూత్ నుంచి 80 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక గ్రామాల వారీగా ఓటింగ్ సరళి పరిశీలిస్తే....

బూత్ నంబరు	గ్రామం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
52	రమణక్కపేట	825	741	89.82
53	,,	774	717	92.64
54	,,	579	490	84.63
55	,,	1143	1029	90.03
56	,,	813	776	94.22
57	సూరేపల్లి	972	923	94.96
58	అక్కిరెడ్డిగూడెం	1203	1088	90.44
59	అక్కిరెడ్డిగూడెం	1121	996	88.85
60	చెక్కపల్లి	1049	924	88.08
61	,,	544	509	93.57
62	,,	784	726	92.60
63	,,	1030	909	88.25
64	,,	677	621	91.73
65	,,	632	557	88.13
66	లోపూడి	902	808	89.58
67	,,	429	391	91.14
68	,,	773	724	93.66
69	,,	528	495	93.75
70	,,	820	772	94.15
71	గుళ్ళపూడి	973	917	94.24
72	,,	564	481	85.28
73	,,	650	561	86.31
74	,,	778	703	90.36
75	,,	689	649	94.19
76	యల్లాపురం	996	880	88.35
77	,,	613	526	85.81
78	,,	567	479	84.48
79	,,	439	359	81.78
80	ముసునూరు	829	750	90.47
81	,,	573	506	88.31
82	,,	719	641	89.15
83	,,	694	617	88.90
84	చింతలవల్లి	1184	1066	90.03
85	,,	1155	940	81.39
86	,,	793	719	90.67
87	,,	576	536	93.06
88	కొర్లకుంట	907	824	90.85
89	,,	715	668	93.43
90	కాట్రేనిపాడు	439	399	90.89
91	,,	834	778	93.29
92	,,	1226	1098	89.56
93	,,	1124	971	86.39
94	,,	957	895	93.52
95	గోపవరం	1128	989	87.68
96	,,	787	694	88.18
97	,,	786	710	90.33
98	,,	913	850	93.10
99	,,	372	357	95.97
100	పెద్దపాటివారిగూడెం	902	804	89.14
101	బలివే	711	605	85.09
102	,,	713	663	92.99
103	వేల్పుచర్ల	1053	965	91.64
104	,,	589	557	94.57
105	,,	745	692	92.89
106	,,	921	841	91.31
107	చిల్లబోయినపల్లి	865	691	79.88
108	,,	460	440	95.65

రక్త నమూనాల సేకరణ

చాట్రాయి, మే 18: మండలంలోని చిన్నంపేటలో శనివారం రెండో రోజు నిర్వహించిన వైద్య శిబిరంలో జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 96 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీనివాసులరెడ్డి, దుర్గాప్రసాద్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రక్త నమూనాలు పరీక్షించి జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలకు కారణాలు కనుగొంటామని వైద్యాధికారులు చెప్పారు. సీహెచ్‌వో రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





కలిదిండిలో వాసవీమాతకు పూజలు.. ముదినేపల్లిలో పూజలకు తరలిన మహిళలు

వాసవీమాత జయంతి వేడుకలు

కలిదిండి, మే 18 : కలిదిండిలో శనివారం ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు బత్తుల రఘురామ్, పూర కళ్యాణి, నీలి మాధవి, కారుమూరి నాగకుమారి, నీలి పద్మావతి, పూర లక్ష్మి, మంగతాయారు దేవి, పలివెల రాజేశ్వరి, పెనుగొండ పావని, చక్కా జగన్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లిలో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సువాసిని పూజలు, సామూహిక కుంకుమార్చన, సహస్ర నా మార్చనలు నిర్వహించారు. అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. స్థానిక ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు, వాసవీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు వత్తుమిల్లి సత్య వరప్రసాద్, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు కొల్లిపర రఘురామన్, కృష్ణప్రసాద్, కురిచేటి తిరుమల శ్రీనివాస్ అమ్మవారికి పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.

కైకలూరు: కైకలూరు వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య ముత్తయిదువులు సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు చొప్పర్ల మురళీకృష్ణ, కొప్పర్తి గోపాలకృష్ణమూర్తి, ఎస్. రాజా ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అనంతరం అమ్మవారి పవళింపు సేవ, లడ్డూ ప్రసాదం వేలంపాటను నిర్వహించారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీపేర్ల సోమేశ్వరరావు కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమ్మవారికి పూజలు చేసి లలితా సహస్రనామ పారాయణం చేశారు.



కైకలూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు